ప్రజాశక్తి
ఆదివారం డిసెంబర్ 28 2025 పేజీలు 12
విజయనగరం పార్వతీపురం మన్యం





అప్పలరాజును విడుదల చేయాల్సిందే

- ఉద్యమకారులపై పీడీ యాక్ట్ నమోదు చేయడం సిగ్గుచేటు
- సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని
- పలుచోట్ల నిరసనలు



విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద నిరసన చేపడుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అప్పలరాజును వెంటనే విడుదల చేయాలని, ఆయనపై పెట్టిన పీడీ యాక్ట్ కేసును ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. అప్పలరాజు అరెస్టుకు నిరసనగా శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేసే వారిపై పీడీ యాక్ట్ కేసులు పెట్టటాన్ని ఖండించారు. 50 ఏళ్ల క్రితం ఈ యాక్ట్ ను తీసుకువచ్చినప్పటికీ ఏ ప్రభుత్వాలు ఇప్పటివరకు అమలు చేసే సాహసం చేయలేదని, కూటమి ప్రభుత్వం మాత్రం, గంజాయి ముఠాలను, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిని, రౌడీ షీటర్లను వదిలేసి ప్రజా ఉద్యమాలు చేసే వారిపై ఈ యాక్ట్ ను ప్రయోగించడం అత్యంత దుర్మార్గమని అన్నారు. గంజాయికి వ్యతిరేకంగా పోరాడే పెంచలయ్యను లేడీ డాన్ హత్య చేస్తే కూటమి ప్రభుత్వం వారిపై ఎటువంటి కేసులూ నమోదు చేసిందని, ఆమెపై ఎందుకు పీడీ యాక్ట్ నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఒక వ్యక్తి నడవడిక, వ్యక్తిత్వం వంటి వాటిని తెలుసుకోకుండా జిల్లా కలెక్టర్లు కూడా పాలకులు చెప్పారని గుడ్డిగా పాటించడం సిగ్గు చేటని అన్నారు. అప్పలరాజు, గత 20, 30 సంవత్సరాలుగా ప్రజా సమస్యల కోసం పోరాటాలు చేస్తున్నాడని, నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికే కృషి చేస్తున్నాడని అన్నారు. అప్పలరాజు ప్రశ్నించే తత్వం, పోరాటపటిమను చూసి ప్రభుత్వాలు ఇప్పటివరకు 19 అక్రమ కేసులు బనాయించాయని. అయినా ఏ ఒక్క కేసు నేరా పూరితం కాలేదని తెలిపారు. అనకాపల్లిలో ప్రజల ఆరోగ్యాలను, పర్యావరణాన్ని దెబ్బతీసే బల్క్ డ్రగ్ పరిశ్రమకు వ్యతిరేకంగా ప్రజలు, రైతులు చేసే పోరాటాలకు అప్పలరాజు నాయకత్వం వహిస్తున్నాడని, ఇది సహించలేని ప్రభుత్వం , ఎలాగైనా (మిగతా..3లో)



వేపాడ.. నిరసన చేపడుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

వసతుల కల్పనకు పెద్దపీట

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- పల్లె పండగ 2.0 ద్వారా రూ. 30 కోట్ల పనులు మంజూరు
- 54 లక్షలతో పంచాయతీ రోడ్డు పనులు ప్రారంభం



శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-గజపతినగరం

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఇందులో భాగంగానే పల్లె పండుగ కార్యక్రమం కార్యక్రమం ప్రారంభించామని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. పల్లెపండగ 2.0 కార్యక్రమంలో భాగంగా గజపతినగరం మండలం పురిటిపెంటలో రూ.54 లక్షల విలువైన పంచాయతీరాజ్ రోడ్డు నిర్మాణ పనులను మంత్రి శనివారం ప్రారంభించారు. పురిటిపెంట రైల్వేగేటు నుంచి జాతీయ రహదారి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు రహదారితో పాటు ఇరవైపులా కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధికి ఆమడ దూరం నెట్టివేశాయని, కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో కనీసం మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. గ్రామీణ రోడ్లు, సిసి డ్రైన్లు, గోకుల్ షెడ్స్, శ్మశానాల అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిచ్చి ఎంజిఎన్ఆర్‌జిఎస్ ద్వారా చేపట్టామని అన్నారు. పల్లె పండుగలో భాగంగా గజపతినగరం నియోజకవర్గంలో రూ.120 కోట్లతో పనులు ప్రారంభించామని, వీటిలో రూ. అరవై కోట్లకు పైగా పనులు పూర్తయ్యి బిల్లుల చెల్లింపులు దశకు చేరుకున్నాయని అన్నారు. మిగిలిన రూ.60 కోట్ల పనులు నిర్మాణ దశలో ఉండగా పల్లెపండుగ 2.0 లో భాగంగా మరో రూ. ముప్పై కోట్లపనులకు (మిగతా..3లో)

లారీ ఢీకొని 33 గొర్రెలు మృతి

మరో 15 గొర్రెలకు గాయాలు



రోడ్డుపై గొర్రెల కళేబరాలు

విజయనగరంకోట : విజయనగరం మండలం జొన్నవలస సమీపంలోని చెల్లూరు నుంచి గొట్లాం వెళ్లే జాతీయ రహదారిపై లారీ ఢీకొని 33 గొర్రెలు మృతి చెందాయి. గంట్యాడ మండలం సిరిపురం గ్రామానికి చెందిన కర్రి సింహాద్రి, చంద్రంపేటకు చెందిన పాటిలు కృష్ణ తమ గొర్రెలను మంద ఆయడానికి చిన్నాపురంలోని పొలాలకు తీసుకెళ్లారు. తిరిగి తమ గ్రామానికి గొర్రెలను తోలుకొని వెళ్తుండగా శనివారం తెల్లవారు జామున విశాఖ నుంచి వెళ్తున్న లారీ వీటిని ఢీకొంది. ఈ ఘటనలో 33 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, 15 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. విషయం తెలుసుకున్న యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల లక్ష్మీ వర ప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి గొర్రెలు కాపరులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. గాయాలు పాలైన గొర్రెలకు పశు సంవర్ధక శాఖ వైద్యురాలు డాక్టర్ శృతి పశుసంవర్ధక శాఖ సిబ్బంది చికిత్స అందించారు. రూరల్ ఎస్ఐ అశోక్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో గొర్రెల కాపరులు తమ జీవనాధారం పోయిందంటూ కన్నీరు పెట్టారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు న్యాయమే లక్ష్యం

విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో మన్యం కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

ఎస్‌సి, ఎస్‌టిలకు ఎక్కడైనా అన్యాయం జరిగినప్పుడు వారికి అండగా నిలవడమే జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాధితులు ఫిర్యాదు చేసిన కేసులలో పురోగతిని, విచారణ తీరును, నిందితులకు శిక్ష పడేలా తీసుకుంటున్న చర్యలను కమిటీ సమీక్షిస్తుందన్నారు. క్షేత్ర స్థాయిలో బాధితులకు ప్రభుత్వం అందించే పథకాలు లేదా చట్టపరమైన రక్షణ అందని పుడు, ఈ కమిటీ ఒక అదనపు రక్షణ పొరలా పనిచేసి బాధితులకు న్యాయం చేకూరుస్తుం దన్నారు. బాధితులు నేరుగా అధికారులకు చెప్పలేని సమస్యలను కమిటీ సభ్యులు గుర్తించి, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది తీవ్రమైన నేరాలు గణనీయంగా తగ్గాయన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలపై జరిగే దాడులు, హత్యలు లేదా అత్యాచారాల వంటి సంఘటనలు ఈ ఏడాది దాదాపుగా నమోదు కాలేదన్నారు. ఘర్షణలు, దూషణలకు సంబంధించిన కొన్ని చిన్నపాటి కేసులు మాత్రమే నమోదయ్యాయని చెప్పారు. సమావేశంలో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఎఎస్‌పి మనీషా రెడ్డి వంగల, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.శ్యామల, డిపిఒ కొండలరావు, కమిటీ సభ్యులు చిరంజీవి, సామల సింహాచలం, కయనా బలరాం, బచ్చల దయానంద, గోవిందమ్మ పాల్గొన్నారు.

విజయనగరం జిల్లాలో

ఐదు ఫుడ్ పార్కులు

- రెండు ప్రయివేట్ ఇండస్ట్రియల్ పార్కులు
- వైజాగ్ ఆర్థిక మండలిపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో ఐదు ఫుడ్ పార్కులను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుదర్ రెడ్డి ఆదేశించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిలో భాగంగా వివిధ ప్రాజెక్టులకు భూసేకరణపై జిల్లా కలెక్టర్ తమ ఛాంబర్‌లో శనివారం సమావేశం నిర్వహిం చారు. జిల్లాలో ఫుడ్ పార్కులను ఏర్పాటు చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయన్నారు. ఒక్కో రెవెన్యూ డివిజన్‌లో ఒక ఫుడ్ పార్కు ఏర్పాటుకు సుమారు 200 ఎకరాల స్థలాన్ని గుర్తించాలని, వీటితోపాటు పతంజలి, జెఎస్‌డబ్ల్యు ఫుడ్‌పార్కులు కూడా ఏర్పాటు అవుతాయని తెలిపారు. వీటి భూసేకరణ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిందాల్, కొత్తవలస ఇన్‌ఫ్రా పేరుతో రెండు ప్రయివేటు ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. భోగాపురంలో 500 ఎకరాలను ఏరోసిటీకి కేటాయించామన్నారు. భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో ఏర్పాటు కానున్న ఐటి హబ్స్ కు భూములు గుర్తించాలని సూచించారు. రెల్లిలో గ్రేహౌండ్స్ కు ఇప్పటికే భూముల కేటాయింపు పూర్తయ్యిందన్నారు. ఎంఎస్ఎంఇ పార్కులు, వివిధ రైల్వే లైన్లు, జాతీయ రహదారుల భూసేకరణ, పరిశ్రమల విస్తరణ, కొత్త పరిశ్రమల ఏర్పాటుపై సమీక్షించి, భూసేకరణ వేగంగా పూర్తిచేసి అప్పగించాలని ఆదేశించారు. సమావేశంలో సిపిఒ పి.బాలాజీ, ఆర్‌డిఒ డి.కీర్తి, జిఎంజిక సిహెచ్ సూర్యచంద్రరావు, ఎపిఐఐసి జెడ్ఎం మురళీమోహన్, పరిశ్రమల శాఖ జిఎం కరుణాకర్, ఇరిగేషన్ సూపరింటెండెంట్ టి.గోవింద తదితరులు పాల్గొన్నారు.

నేడు కందికొత్తల ఉత్సవం

కలెక్టర్‌ను ఆహ్వానించిన కమిటీ 4 లో

అమానవీయం

పాతేసిన దళిత మహిళ మృతదేహాన్ని వెలికి తీయించిన వైనం 12 లో



పార్వతీపురంలో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మన్మథరావు

మహాసభల జయప్రదానికి విస్తృత ప్రచారం

4 లో

సమయపాలన పాటించరా?

ప్రజాశక్తి - వేపాడ



తెరుచుకోని జెఇ కార్యాలయం

స్థానిక మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో ఉన్న పంచాయతీ రాజ్ జెఇ కార్యాలయం శనివారం ఉదయం 12 గంటల వరకు తెరవకపోవడంతో కార్యాలయానికి పని నిమిత్తం వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. జెఇ ఆలీ సమయం పాటించరా అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది పనివేళలు పాటించాలని ఎంపిడిఒ ప్రతి రోజూ చెబుతున్నా పట్టించుకోకపోవడం విచారకరం. చాలా మంది ఉద్యోగులు ఇష్టం వచ్చినప్పుడు రావడం మొఖం చూపించి వెళ్లిపోవడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలు జరగడానికి ఆలస్యం అవుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. పిఆర్ జెఇ తీరు మారకపోతే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయక తప్పదని కార్యాలయానికి పని నిమిత్తం వచ్చేవారు హెచ్చరించారు.

కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామం నుంచి చందలూరు వెళ్లే మార్గంలో తమ్మయ్య చెరువు వద్ద కల్వర్టు నిర్మాణానికి శనివారం పంచాయతీ రాజ్ శాఖ అధికారులు కొలతలు వేసి ప్రతిపాదలను పంపించారు. ఇటీవల సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడంతో ప్రతిపాదనలు పంపించాలని ఆదేశాలు వచ్చాయని ఈ నేపథ్యంలో నిధులు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని పంచాయతీ రాజ్‌శాఖ ఎఇ మానస, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కుమార్ తెలిపారు. అప్పారావు సమక్షంలో కొలతలు వేసి ప్రతిపాదనలు పంపించినట్లు వారు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇసిసిఇడే

ప్రజాశక్తి - వేపాడ

ఐసిడిఎస్ వియ్యంపేట ప్రాజెక్ట్ పరిధిలోని మండలంలో వేపాడ, బొద్దాం, ఎన్‌కెఆర్ పురం అంగన్వాడి కేంద్రాల్లో శనివారం ఇసిసిఇ డే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిల్లల తల్లులను ఆహ్వానించి, ప్రీస్కూల్‌కు సంబంధించిన వివిధ విద్యాసామగ్రిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.భాగ్యవతి మాట్లాడుతూ ప్రీస్కూల్ మెటీరియల్ ద్వారా పిల్లలకు కేవలం ఆట పాటలతో విద్య మాత్రమే కాకుండా శారీరక అభివృద్ధి, కండరాల అభివృద్ధి, భాషాభివృద్ధి వంటి ముఖ్యమైన అంశాలు కూడా మెరుగుపడతాయని వివరించారు.



బాధితులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని కొండవెలగా గ్రామానికి చెందిన దంతినాడ రాము ఇంటిలో జరిగిన అగ్నిప్రమాదంలో నిత్యవసర వస్తువులు కాలిపోయాయి. ఈ విషయం తెలిసిన వెంటనే అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకులు దంతులూరి అజయ్‌బాబు స్పందించి తన ఆధ్వర్యంలో మొయిద సత్యనారాయణ, బట్టు లక్ష్మణరావు సమక్షంలో శనివారం బాధిత కుటుంబానికి రూ.3వేలు నగదు, రూ.10వేలు విలువ చేసే నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేష్, చిన్న మాస్టర్, కోచ్ చల్లా రాము, రామచంద్రరావు మాస్టర్, బి.వి.రమణ మాస్టర్, బూత్ కన్వీనర్ అట్టాడ లక్ష్మణ, రెడ్డి అప్పలస్వామి, టిడిపి ప్రధాన కార్యదర్శి గోరంటి ఈశ్వరరావు, బోద అప్పలనాయుడు, అర్జి శ్రీను, పంపనా పాపయ్య, వార్డ్ మెంబెర్స్ బేరి అప్పలనరసయ్య, బట్టు శ్రీను, పులుకుర్తి శ్రీను, కెల్లా అమర్, లండ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి మండల కౌన్సిల్ సమావేశం స్థానికి మున్సిపల్ పాఠశాలలో శనివారం నిర్వహించారు. యుటియఫ్ రాష్ట్ర నాయకులు విజయ గౌరి మాట్లాడుతూ ఉపాధ్యాయులను భోధనకు పరిమితం చేసి యాప్‌ల భారం తగ్గించాలని, ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరారు. అనంతరం యుటియఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. బొబ్బిలి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులుగా మహేష్, స్వామి నాయుడు, బొబ్బిలి పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులుగా స్వామి నాయుడు, శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ నాయకులు బి.రమేష్, కృష్ణదాస్, రామకృష్ణ, అనేం శ్రీనివాసరావు, మహేష్, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండల యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక మండల కేంద్రంలో శనివారం జరిగింది. అధ్యక్షులుగా సిహెచ్ నారాయణరావు, ప్రధాన కార్యదర్శిగా పెంకి గౌరీ శంకరరావు, ఉపాధ్యక్షులుగా బలగ ప్రసాద్, పి.జ్యోతి, కోశాధికారిగా బి.శ్రీనివాసరావుతో పాటు మరి కొంతమందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా నాయకులు పక్కి వాసు, ఎం అప్పలనాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమస్యలపై పోరాటం చేయడంతోపాటుగా, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునే దిశగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బొబ్బిలి: మాట్లాడుతున్న విజయగౌరి

తక్షణమే న్యాయం చేయాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రభుత్వం తక్షణమే జిందాల్ నిర్వాసితుల పక్షాన నిలబడి వారికి న్యాయం చేయాలని సిపిఎం నాయకులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. శనివారం బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులు చేపట్టిన నిరసనలు, నిరాహార దీక్షలు 196వ రోజుకు చేరింది. దీంతో శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ ఒకవైపు తాము న్యాయస్థానంలో పోరాడుతుంటే, కంపెనీ యాజమాన్యం పోలీసుల అండతో రెచ్చిపోతోందని మండిపడ్డారు. ప్రభుత్వం మౌనంగా ఉండటం వల్లే తమ పంట పొలాలు నాశనమయ్యాయని వారు ఆరోపించారు. తమ భూముల్లో ప్రవేశించిన జిందాల్ యాజమాన్యాన్ని తక్షణమే బయటికి పంపించి, తమ భూములు తమకి అధికార పూర్వకంగా ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిందాల్ నిర్వాసితులు, స్థానిక రైతులు, నిర్వాసితులు పాల్గొన్నారు.

2 నుంచి భూముల రీ సర్వే

ప్రజాశక్తి- శృంగవరపు కోట

జనవరి రెండో తేదీ నుంచి రీ సర్వే నిర్వహిస్తామని తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కొట్టం గ్రామంలో సర్పంచ్ బాల సన్యాసమ్మ అధ్యక్షతన శనివారం రీ సర్వే గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూములు రిసర్వే జనవరి 2 నుండి కొట్టంలో ప్రారంభిస్తామని, రైతుల ఫోన్ నెంబర్స్‌తో వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేశామని, ప్రతిరోజు సర్వే చేయాదాల్చిన భూముల సర్వే నెంబర్స్, రైతులపేర్లుతో వాట్సప్ గ్రూప్‌లో పెడతామని అన్నారు. కొట్టంలో 2600 ఎకరాల్లో 1955 మంది రైతులు సాగుచేస్తున్నారని రైతులంతా రీ సర్వేలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నాయకులు వబ్బిన సన్యాసి నాయుడు, రీ సర్వే డిటి కీర్తన, మండల సర్వేయర్ రామం, విఆర్ఒ, విలేజ్ సర్వేయర్ హరిబాబు, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు నారాయణమూర్తి, సత్యనారాయణ, జనసేన నాయకులు కొల్లి సురేంద్ర, రామకృష్ణ రైతులు పాల్గొన్నారు.

భూ సర్వేలను సద్వినియోగం చేసుకోవాలి

చీపురుపల్లి: మండలంలో జరగనున్న నాలుగో విడత భూ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ డి.ధర్మరాజు కోరారు. మండలంలోని గొల్లలపాలెం, పెదనాడపల్లి గ్రామాలలో నాలుగో విడత భూ సర్వేను ప్రారంభించినట్లు శనివారం ప్రకటించారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు గ్రామ పెద్దలు రెవెన్యూ సిబ్బందితో గొల్లల పాలెం, చిన్న నడిపల్లి గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది గ్రామాలలో సర్వే నిర్వహించే సమయంలో రైతులు వారి సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చి అక్కడికక్కడే పరిష్కరించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.



చీపురుపల్లి : ర్యాలీ చేస్తున్న తహశీల్దార్, తదితరులు

చినగుడిపాలలో గ్రామ సభ ర్యాలీ

వేపాడ: మండల పరిధిలోని వల్లంపూడి, చినగుడిపాల గ్రామాల్లో తహశీల్దార్ ఒ.రాములమ్మ ఆధ్వర్యంలో శనివారం గ్రామ సభ ర్యాలీ నిర్వహించారు. భూ రీ సర్వే కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి, రీ సర్వే ప్రక్రియపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. భూముల కొలతలు, రికార్డుల నవీకరణ, రైతులకు కలిగే ప్రయోజనాలపై అధికారులు వివరించారు.

రైతు సేవలకే ప్రాధాన్యత ఇవ్వాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రామభద్రపురం

రైతు సేవలకే ఆర్ఎస్‌కె సిబ్బంది మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండల పరిధిలోని కోటశిర్లాంలో రూ.24లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఎన్నో ఏళ్ళుగా అపరిష్కృతంగా ఉన్న ఇరిగేషన్ పనులు పూర్తిచేయడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా రూ.30 కోట్లతో ఇరిగేషన్ పనులు చేపట్టడానికి అన్ని చర్యలూ తీసుకున్నామని అన్నారు. రామభద్రపురం మండలంలో ఎక్కువగా వర్షాధారంపై ఆధారపడడంతో ఏడొంపులగెడ్డ ఆనకట్ట దిగువన ఉన్న చెరువులకు పెద్ద ఎత్తున మరమ్మతు పనులు చేపడుతున్నామని తెలిపారు. కోటశిర్లాం గ్రామానికి సమీపంలో ఉన్న జంతిగెడ్డపై చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.96 లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు చేపడతామని అన్నారు. ఈ ప్రాంతంలో రీ సర్వే,భూసమస్యలు అధికంగా ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని, వీటిపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కోరతానని హామీ ఇచ్చారు. యూరియా కొరతపై కూడా వ్యవసాయ శాఖ జెడితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానన్నారు. కోటశిర్లాం గ్రామంలో సిసి రోడ్లు, డ్రైన్స్‌కు నిధులు విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. రెండు మూడు నెలల్లో కొత్త పెన్షన్లు మంజూరుకానున్నాయని, అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు కర్రోతు తిరుపతిరావు, జిల్లా టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు కనిమెరక శంకరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కరణం విజయభాస్కరరావు, సర్పంచ్ ప్రతినిది తాడ్డి శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డిఇ అప్పారావు, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు చొక్కాపు రామారావు, తహశీల్దార్ అజరఫిజాన్, ఎంపిడిఒ రత్నం తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఎస్‌కెను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

గణిత క్విజ్ పోటీల్లో విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- మెరక ముడిదాం

జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల గణిత ఫోరం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గణిత క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జూనియర్ విభాగంలో బైరిపురం పాఠశాలకు చెందిన 6,7,8 తరగతి విద్యార్థులు, సీనియర్ విభాగంలో 9,10 విద్యార్థుల పాల్గొని ప్రథమ స్థానాలు కైవసం చేసుకుని సత్తా చాటారు. సీనియర్ విభాగంలో ద్వితీయ విజేతగా బిల్లలవలస ఉన్నత పాఠశాల, జూనియర్ విభాగంలో చినబంటుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలకు రోలింగ్ షీల్డ్‌లను మండల విద్యాశాఖ అధికారులు ఎం.చంద్రశేఖర్, టి.ధర్మశ్రీను చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మెరకముడిదాం ప్రధానోపాధ్యాయులు ఎస్.తిరుపతి రావు, గణిత ఫోరం ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విమర్శలు మాని.. సమస్యలపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - చీపురుపల్లి

ప్రజా సమస్యలపై పోరాడుతున్న వైసిపి నాయకులను విమర్శించడం మానేసి ప్రజల సమస్యలు తీర్చడంపైన ఎమ్మెల్యే కళా వెంకటరావు దృష్టి పెట్టాలని వైసిపి మండల నాయకులు హితవు పలికారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తదితరులు పత్రికా సమావేశంలో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కళావెంకటరావు పత్రికా సమావేశాల పెట్టి తమ నాయకులు మీద విమర్శలు కాకుండా నియోజకవర్గం సమస్యలు మీద దృష్టి పెడితే ప్రజలు సంతోషిస్తారని చెప్పారు. గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చిన జగన్ మీద రోజ ద్రోహం కేసు పెట్టాలా అని ప్రశ్నించారు. బ్యాంకులను కొల్ల గొట్టిన వైట్ కాలర్ నేరస్తుడిని డిప్యూటీ స్పీకర్‌గా పెట్టి మీరు నీతులు మాట్లాడుతారా, తీవ్ర వాదులు కన్నా ఘోరంగా రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు పతివాడ రాజారావు, రఘుమండ త్రినాధరావు, గవిడి సురేష్, పేరుపి సర్పంచ్ పృధ్వి, ముజుకిర్, రేవల్ల సత్తిబాబు, మీసాల రమణ, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- గంట్యాడ

స్థానిక ఎస్‌సి బాలుర వసతి గృహంలో శుక్రవారం రాత్రి సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్నపూర్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థుల గదులను, టాయిలెట్లను తనిఖీ చేశారు. విద్యార్థులతో మమేకమై పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి గొర్ల గోవింద సన్యాసిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రమజీవుల నోట సిఐటియు మాట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని శ్రమజీవలందరి నోటా గడిచిన వారం రోజులుగా సిఐటియు మాట వినిపిస్తోంది. పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, క్వారీలు, మిల్లులు సహా వివిధ రంగాల్లో శ్రమిస్తున్న కార్మికులు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఆర్టీసి, రైల్వే, పోస్టల్ తదితర ప్రభుత్వ శాఖల్లోని చిరుద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు తదితర స్కీమ్‌వర్కర్లు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు, నగరాల్లోని తోపుడు బండ్లు, ఫుట్‌పాత్ వ్యాపారులు, ఆటో కార్మికులు, ఇంటి పనివార్లు, ఇలా ఒకరా ఇద్దరా అందరి నోటా సిఐటియు పండగ మాటే. ఇందుకు కారణం లేకపోలేదు. సిఐటియు అఖిలభారత మహాసభలు విభజిత ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా విశాఖ కేంద్రంగాను తొలిసారిగా ఈనెల 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సుమారు నెలరోజులుగా కార్మికవర్గమంతా చేతులు కలుపుతూ ప్రచార కార్యక్రమాలు ఉవ్వెత్తున సాగిస్తున్నారు. కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, సోషల్ మీడియా, బైక్ ర్యాలీలు, వివిధ కళా రూపాలు ఇలా ఒకటేమిటి రకరకాల రూపాల్లో ప్రచార హోరు సాగిస్తు న్నాయి. మహా సభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ తమకు తోచిన సాయాన్ని



వ్యక్తిగతంగా అందిస్తునే మిగిలిన పేద, మధ్యతరగతి ప్రజానీకాన్ని ఆర్థికంగా, హార్థికంగా భాగాస్వామ్యులు చేసేందుకు పెద్దఎత్తున కదులుతున్నారు. వీరందరిదీ ఒకటే ఆకాంక్ష. శ్రమకు తగ్గ ఫలితం ఉండాలని, పని భద్రత, సామాజిక భద్రత కల్పించాలని, ఉపాధిని దెబ్బతీసే ప్రైవేటీకరణ విధానాలు, శ్రమదోపిడీకి దోహదపడే కార్మిక కోడ్లను రద్దుచేయాలని, ఉన్న కార్మిక చట్టాలను రక్షించాలని పెద్దఎత్తున కదులుతున్నారు. మరోవైపు కార్మికుల శ్రమను దోచుకునే రీతిలో ప్రభుత్వాలు అడుగులు వేస్తునే ఉన్నాయి. ఈనేపథ్యంలో సిఐటియు జెండాలు చేతబూనుతూ విశాఖ కేంద్రంగా జరగబోతున్న మహాసభల్లో తమ సత్తా నిరూపించే దిశగా అడుగులు వేస్తున్నారు. మహాసభల నేపథ్యంలో ఈనెల 27వ తేదీ నుంచే వారం రోజులపాటు నిర్వహిస్తున్న శ్రమక ఉత్సవ్ పేరిట పలు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కవులు, సాహితీవేత్తలు శ్రమజీవులు దుస్థితిపై తమ కలాలకు పదును పెట్టనున్నారు. ముఖ్యంగా విద్యార్థి, నిరుద్యోగ యువత శ్రామిక పండక్కి ఆసక్తి చూపడం గమనార్హమే. ఇంకా ర్యాలీలు, జాతాలు దిశగా మరెన్నో రంగాలకు చెందిన కార్మికులు సన్నద్ధమౌతున్నారు. ఇలా శ్రమజీవులు, వారికి మద్దతు పలుకుతున్న అభ్యదయవాదుల్లో ఎక్కడ విన్నా జిల్లాలో సిఐటియు ఆవిర్భావం, పోరాటాలు, ఫలితాలు, ఆయా పోరాట సందర్భాల్లో పాలకులు మోపిన నిర్బంధాలు, బెదిరింపులు, అక్రమ అరెస్టులను గుర్తు చేసుకుంటున్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి- దత్తిరాజేరు

సామాన్య ప్రజల నుంచి వస్తున్న సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులు అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిడిఓ కిషోర్‌కుమార్ అధ్యక్షతన శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో వచ్చిన 116 అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులకు పంపి వాటికి పరిష్కారం కనుక్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ గోపాల్ రాజు, టిడిపి మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, నాయకులు మిత్తిరెడ్డి ఈశ్వరరావు, బోడసింగి సత్యనారాయణ, చెల్లూరి సత్యారావు, అధికారులు పాల్గొన్నారు.

భోగాపురం: ప్రజా సమస్యల పరిస్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని ముంజేరు పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె ప్రజాదర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి: మంత్రి

రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కూటమి నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. చుక్కపేట గ్రామంలో శనివారం టిడిపి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో పార్టీ తీసుకున్న నిర్ణయం ఫైనల్ అని మధ్యలో ఎన్ని విభాగాలు ఉన్న క్షేత్రస్థాయిలో తీసుకున్న పార్టీ నిర్ణయాన్ని బలపరిచే విధంగా తాము పని చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పార్టీలో వర్గ విభేదాలను పక్కనపెట్టి ఏకతాటిపై నడపాలని అందరూ కలిసికట్టుగా పనిచేసినప్పుడే పార్టీ అభివృద్ధి దిశగా అడుగులు పడతాయని అన్నారు. 56 ఏళ్ళ కలగా ఉన్న సార్వగడ్డ రిజర్వాయర్‌ను మంజూరు చేస్తూ సిఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారని నిర్మాణం పూర్తి చేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజల జీవన విధానాన్ని సమూలంగా మార్చవచ్చనని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలరాజు, టిడిపి మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, గజపతినగరం అధ్యక్షులు గంట్యాడ శ్రీదేవి, క్లస్టర్ ఇంచార్జీలు మిత్తిరెడ్డి ఈశ్వరరావు, బోడ సింగిసత్తిబాబు, చెల్లూరి సత్యారావు, వంగపండు కృష్ణ, పాల్గొన్నారు.

బోట్ షికారు ప్రారంభించిన మంత్రి

గంట్యాడ: మండలంలోని తాటిపూడి రిజర్వాయర్‌లో వాటర్ స్పోర్ట్స్ సింపుల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బోటు షికారు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పది బోట్లను, రెండు టూరిజం స్టాళ్లను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు రెండవ దశ బోటు షికారు పనులను ఆ సంస్థ చేపట్టింది. ఇందులో భాగంగా 19 సీట్లతో కూడిన వాటర్ ట్యాక్సీ, ఆరు సీట్లతో కూడిన స్పీడ్ బోట్, 12 సీట్లతో కూడిన గల్ బ్రిడ్జ్ బోట్, 6 సీట్లతో కూడిన వర్లాండో బోట్, రెండు సీట్లతో కూడిన ఓషన్ కయాక్ బోట్లు నాలుగు, రెండు సీట్లతో కూడిన వాటర్ రిక్షాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తాటిపూడి రిజర్వాయర్ సాగునీటి సంఘం అధ్యక్షుడు, పలువురు పర్యటశాఖ అధికారులు, వాటర్ స్పోర్ట్స్ సింపుల్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.


గంట్యాడ: బోటు షికారును ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి

అప్పలరాజును విడుదల చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

భూములు లాక్కొని పరిశ్రమకు అప్పజెప్పేందుకు అప్పలరాజు అడ్డు తొలగించుకునేందుకు ఆయనపై ఇలాంటి దారుణానికి, దుర్మార్గానికి వడి కట్టిందని అన్నారు. వెంటనే అప్పలరాజు పై పెట్టిన పీడీ యాక్ట్ కేసును ఉపసంహరించుకొని బేషరత్తుగా విడుదల చేయాలని, లేనియెడల భవిష్యత్తులో పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి. రమణమ్మ, బి. రాం బాబు, ఎ.జగన్మోహన్, బి.రమణ, ఆర్.ఆనంద్ పాల్గొన్నారు.

గరివిడి : అప్పలరాజు అరెస్టుకు నిరసనగా గరివిడిలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం గరివిడి మండల కార్యదర్శి ఎ.గౌరినాయుడు మాట్లాడుతూ సంఘ వ్యతిరేక పనులు చేసిన వారిపైన, రౌడీలు, గంజాయి ముఠాలపై పెట్టాల్సిన పీడీ యాక్ట్‌ను ప్రజా సమస్యలపై పనిచేస్తున్న ప్రజాసంఘాల నాయకులపై కేసులు పెట్టడం అత్యంత దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ, పార్టీ సభ్యులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : అనకాపల్లి జిల్లా సిపిఎం నాయకులు అప్పలరాజుపై పీడీ యాక్ట్ దుర్మార్గమని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. శనివారం ఆయన స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద మీటింగ్ నిర్వహించారు. వెంటనే అప్పలరాజుపై పెట్టిన పీడీ యాక్ట్ కేసును రద్దుచేసి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వేపాడ: సిపిఎం నాయకుడు అప్పలరాజుపై అక్రమంగా పీడీ యాక్ట్ విధించి అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ సిపిఎం నాయకుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో మండలంలోని బొద్దాంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దత్తిరాజేరు: అనకాపల్లి సిపిఎం నాయకులు అప్పలరాజుపై పీడీ యాక్ట్ కేసు పెట్టి సెంటర్ జైలుకు పంపించడాన్ని నిరసిస్తూ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి ఆధ్వర్యంలో పెదమానాపురం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యవాదులను ప్రజల పక్షాన నిలబడే అభ్యుదయ కాముకులను నిర్బంధించి ఉద్యమాలను అణచివేయాలని చూస్తుందన్నారు. కార్యక్రమంలో బి.అప్పలనాయుడు, ఎ.రాంబాబు, ఈశ్వరరావు, బలరాం, ఎం సతీష్, కే రాము, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



దత్తిరాజేరు : నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

వసతుల కల్పనకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. పల్లెపండుగ మొదటి విడతలో విజయనగరం జిల్లాలో రూ. 500 కోట్ల తో పనులు చేపట్టామని, వీటిలో రూ. 200 కోట్ల పనులు పూర్తయ్యి బిల్లులు జమ చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఆర్ అండ్ బి శాఖ ద్వారా రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టామని, గజపతినగరం నుంచి మెంటాడ వరకు రోడ్డు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గజపతినగరం నియోజకవర్గంలో సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న పురిటిపెంట, కనిమెరక, కోమటిపల్లి వద్ద నూతనంగా ఆర్ఒబిల నిర్మాణానికి పనులు మంజూరు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పివివి గోపాలరాజు, పిఎసిఎస్ అధ్యక్షులు బంగారు నాయుడు, గజపతినగరం మండల టిడిపి అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మాజీ జడ్‌పిటిసి మక్కువ శ్రీధర్, బిజెపి జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టివి రమణమూర్తి, డిపి చంద్రశేఖర్ తోపాటు పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

10వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో అదనంగా 10వేల ఎకరాల్లో ఉద్యానసాగు విస్తరణకు ప్రత్యేకంగా ఉద్యానవన మిషన్‌ను రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో, సమష్టిగా కృషి చేసి లక్ష్యాన్ని సాధించాలని కోరారు. డిఆర్‌డిఎ, వ్యవసాయ, ఉద్యాన, సూక్ష్మ సేద్యం, విద్యుత్, మార్కెటింగ్ తదితర శాఖల మండల, క్షేత్రస్థాయి అధికారులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటి చేయాలన్న ఉద్దేశ్యంతో సంప్రదాయ వరి పంటకు బదులు ఉద్యాన పంటలను సాగు చేయాలన్న ఉద్దేశంతో ఈ ప్రత్యేక మిషన్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రస్తుత రబీ సీజన్‌లో 4వేల ఎకరాలు, ఖరీఫ్‌లో 6 వేల ఎకరాలు, మొత్తంగా 10వేల ఎకరాల్లో అదనంగా వివిధ ఉద్యాన పంటల సాగు చేపట్టడం ఈ మిషన్ లక్ష్యమని పేర్కొన్నారు. సంప్రదాయ పంటలు బదులు ఉద్యాన పంటలవైపు మళ్లేందుకు ఆసక్తి ఉన్న ఉత్సాహవంతులైన రైతులను గ్రామానికి కనీసం ఒక్కరికి తక్కువ కాకుండా మార్గదర్శిగా ఎంపిక చేయాలని కోరారు. వచ్చేనెల నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి క్షేత్రస్థాయి పర్యటనలు చేయనున్నారని, దీనికి అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం అమలు కోసం రూపొందించిన పిపిటిని డిఆర్‌డిఎ శ్రీనివాస్ పాణి ప్రదర్శించారు. వ్యవసాయశాఖ జెడి విటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా ఉన్నాయని, మహిళల సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని భారత మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.విమల, పి.దుర్గా భవాని అన్నారు శనివారం స్థానిక అమర్ భవన్ లో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాయి రమణమ్మ, బుగత పావని ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన విమల, దుర్గాభవాని మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను పట్టించుకునే పరిస్థితుల్లో లేవన్నారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మహిళలపై దాడులు ఆగలేదన్నారు. కుటుంబం సక్రమంగా నడవడంలో మహిళ పాత్ర కీలకం అన్నారు. ఇటీవల కాలంలో ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులు మహిళలపై నోరు జారడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలకు స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేస్తామని చెప్పి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దానిని మరిచిపోయిందన్నారు. మహిళలకు ఉచితంగా పౌష్టికాహారాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేయాలన్నారు. విద్యా ఉపాధి వైద్యం అందించాల్సిన బాధ్యత కచ్చితంగా ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా మహిళా సమైక్యను బలోపేతం చేసేందుకు ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమైక్య నాయకురాలు కె.స్రవంతి తదితరులు పాల్గొన్నారు

రెండు ఆటోలు ఢీ 8 మందికి గాయాలు

ప్రజాశక్తి- రాజాం

రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొట్టిన సంఘటన శనివారం మధ్యాహ్నం మండలంలోని కొత్తపేట జంక్షన్ సమీపంలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో 8 మంది గాయపడ్డారు. తెర్లాం నుంచి రాజాం వస్తున్నా యండమూరి గణేష్ ఆటోను, రాజాం నుండి తెర్లాం వైపు వెళ్తున్న మరో ఆటో ఎదురుగా వెళ్లి ఢీకొట్టడంతో కారాడ, తెర్లాం, గదవలస, శ్రీకాకుళంకు చెందిన 8 మంది గాయపడ్డారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను 108 సహాయంతో రాజాం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషమంగా ఉన్న ఇద్దరినీ మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఆటో డ్రైవర్ లక్ష్మణ్‌రావు అతివేగం, అజాగ్రత్త, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని క్షతగాత్రులు తెలిపారు. మరో ఆటో డ్రైవర్ యండమూరి గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


ప్రమాదానికి గురైన ఆటోలు

మహాసభల జయప్రదానికి విస్తృత ప్రచారం



రాజాంలో రైస్‌మిల్లు కళాసీలతో సమావేశమైన నాయకులు సురేష్

ప్రజాశక్తి-పార్వతీపురం, విజయనగరం

సిఐటియు జాతీయ మహాసభకు తరలివెళ్లేందుకు ఊరువాడ సమాయత్తమవు తోంది. అన్ని రంగల కార్మికులను సిఐటియు నాయకులు సమాయత్తం చేస్తున్నారు. ఇందుకోసం రైస్‌మిల్లుల, పరిశ్రమలు, అంగన్వాడీ, ఆశా, ఎండిఎం ఇలా అన్ని రంగాల కార్మికులతో సమావేశాలు ఏర్పాటు చేసి మహాసభ ఆవశ్యకతను తెలియజేస్తున్నారు. విశాఖలో జనవరి 4న జరిగే బహిరంగ సభకు తరలి రావాలని, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని చెబుతున్నారు.

సిఐటియు అఖిల భారత మహాసభల సందర్భంగా వచ్చేనెల 4న నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం సిఐటియు ఆధ్వర్యాన బైక్ ర్యాలీ నిర్వహించారు. మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో జరుగనున్న అఖిలభారత సిఐటియు మహాసభల్లో కార్పొరేట్ విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించి భవిష్యత్తులో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు. లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకు సిఐటియు పోరాడనుందని తెలిపారు. .5 రోజులు పాటు మహాసభల్లో చర్చించిన విషయాలను 4న బహిరంగ సభ ద్వారా దేశవ్యాప్తంగా కార్మిక వర్గానికి పిలుపు ఇవ్వనుందని పేర్కొన్నారు. ఈనేపథ్యంలో విశాఖలో జరిగే బహిరంగ సభకు లక్షలాది కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ బి.వి.రమణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంటా జ్యోతి, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, కొల్లి సాంబమూర్తి, గొర్లె వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పాకల సన్యాసి, మున్సిపల్ యూనియన్ నాయకులు మల్లేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజాం : రాజాంలోని రైస్‌మిల్లు కళాసి వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్ కరపత్రాలు పంచుతూ ప్రచారం చేపట్టారు. ఈనెల 31 నుంచి విశాఖలో జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జనవరి 4న లక్షలాది కార్మికులు, ఉద్యోగులుతో మహాప్రదర్శన, బహిరంగసభకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.త్రినాథ్, యూనియన్ నాయకులు కంచినాయుడు, శ్రీనివాసరావు, భుజంగరావు, వెంకటరమణ, చిట్టి నాయుడు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : మహాసభల జయప్రదానికి మండలంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణ ఆధ్వర్యాన ప్రచారం చేపట్టారు. 4న జరిగే బహిరంగ సభకు తరలిరావాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు నాయకులు బి.ఆనంద్, పి.సంగమేసు, దుర్గారావు, కూర్మారావు, వేణు, తదితర కార్మికులు పాల్గొన్నారు

మక్కువ : మక్కువ, సాలూరు మండలాల్లో ప్రచారం జరిగింది. ఈ కార్యక్రమాల్లో అంగన్వాడీ యూనియన్ మక్కువ మండల నాయకులు ఎల్. దాలమ్మ, సాలూరు మండల నాయకులు పుష్ప, కుమారి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, ఎం శ్రీను పాల్గొని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయని, అందులో భాగంగానే లేబర్ చట్టాలు అమలు చేసి కార్మికులకు నష్టం చేసే విధానాలు తెస్తున్నాయని తెలిపారు. ఈనేపథ్యంలో జనవరి 4న విశాఖలోజరిగే బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గుమ్మలక్ష్మీపురం : ః మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని గొరడ సంతలో సిఐటియు నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ఆర్థిక విధానాల వలన కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులకు గురవుతుందని, కనీస వేతనాలు ఉద్యోగ భద్రత లేక కోట్లాదిమంది ఉద్యోగులు, కార్మికులు దినదిన గండంగా జీవితం సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్ట పెట్టేందుకు ప్రభుత్వ రంగాన్ని బలహీన పరుస్తున్నారని ఈ విధానాలకు వ్యతిరేకంగా నికరమైన పోరాటాలు నిర్వహించేది సిఐటియు అని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పువ్వల తిరుపతిరావు, మధ్యాహ్న భోజన నిర్వహకుల సంఘం నాయకులు తాడంగ శ్రీదేవి, మండంగి మహిత నిమ్మక లలిత, తాడంగి లక్ష్మీపార్వతి, పువ్వల అమరావతి తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : మహాసభలు సందర్భంగా వచ్చేనెల 4న విశాఖలో జరుగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, ఉపాధ్యక్షులు రెడ్డివేణు అన్నారు. బలిజిపేటలో అంగన్వాడీలతో కలిసి కరపత్రం విడుదల చేశారు. ఆరోజు ర్యాలీ విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర అంబేద్కర్ విగ్రహం నుండి, మున్సిపల్ స్టేడియం కొత్త రోడ్డు వన్ టౌన్ వరకు సాగుతుందని, మున్సిపల్ స్టేడియంలో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇందిర, దాలమ్మ, లక్ష్మి, ప్రమీల, స్వర్ణ, వరలక్ష్మి, రూప, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : జనవరి 4వ తేదీన చలో విశాఖ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి కోరారు. మండలంలోని విక్రమపురం అంగన్వాడీ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి, అంగన్వాడీ యూనియన్ నాయకులు జ్యోతి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



పాలకొండలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు రమణారావు





సాలూరు, కొమరాడలో అంగన్వాడీలతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ఎన్‌వై నాయుడు, సాంబమూర్తి

నేడు కందికొత్తల ఉత్సవం

కలెక్టర్‌ను ఆహ్వానించిన కమిటీ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం హెచ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించే గిరిజనుల సంప్రదాయ పండుగ కందికొత్తల ఉత్సవాలకు నిర్వహణ కమిటీ సభ్యులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. హెచ్ గ్రౌండ్ ప్రాంతమంతా పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేస్తున్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తోయక నాగభూషణ్, పట్టిక శంకర్రావు తెలిపారు. ఈ ఉత్సవాలకు కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి, పాలకొండ సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్, డిఎస్‌పి రాంబాబును ఆహ్వానించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నిమ్మక శేఖర్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు బొత్తాడ గౌరీ శంకర్రావు, కమిటీ సభ్యులు మండంగి రమణ, అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.



కలెక్టర్‌కు ఆహ్వానం అందజేస్తున్న ఉత్సవ కమిటీ

మూల జమ్ములో..

లుంబేసు పంచాయతీ మూలజమ్ము గ్రామంలో శనివారం గిరిజనులు కంది కొత్తల పండగను జరుపుకున్నారు. గ్రామంలో గొడ్డలమ్మకు పూజలు చేసి ఊరేగించారు.


సరుగుడగూడలో 'మా ఊరికి మలేరియా వచ్చింది'

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలోని సరుగుడగూడ గ్రామంలో మా ఊరికి మలేరియా వచ్చింది కార్యక్రమాన్ని మండల అధికారులు శనివారం చేపట్టారు. ఆ గ్రామానికి అధికారులు వెళ్లి గ్రామంలో మలేరియా బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎస్.రమేష్ మాట్లాడుతూ గ్రామంలో మలేరియా సోకినట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. అనారోగ్యం లక్షణాలు ఉన్న ప్రతిఒక్కరికీ రక్త పరీక్షలు నిర్వహించి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. గ్రామంలో ఐఆర్ఎస్ ఎఎంసి దోమల మందు పిచికారీ చేయించారు. అంగన్వాడీ, పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. గ్రామంలో తాగునీటి నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రాధాకృష్ణ పాల్గొన్నారు.

సమరశీల పోరాటాల్లో సిఐటియు ప్రత్యేక పాత్ర

- సంఘం అఖిల భారత మహాసభ సందర్భంగా 'ప్రజాశక్తి'తో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'సిఐటియు ఒక ప్రత్యేక పరిస్థితుల్లో, చారిత్రక సందర్భంలో దేశంలో స్థాపించబడింది. నెహ్రూ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి ఒక్క ట్రేడ్ యూనియన్ కూడా నాడు మిగల్లేదు. స్వాతంత్ర్య పోరాటంలో సమరశీలంగా వ్యవహరించిన ఎఐటియుసి నెహ్రూ ప్రభుత్వాన్ని బలపరచడాలని నిర్ణయించడంతో పెట్టుబడిదారీ విధానాన్ని ప్రశ్నించే ట్రేడ్ యూనియన్ లేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికవర్గ హక్కుల కోసం పోరాడే సంస్థగా సిఐటియు ఆవిర్భవించింది' అని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. సిఐటియు అఖిల భారత మహాసభ ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ విశాఖ బీచ్ రోడ్డులోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగనున్న నేపథ్యంలో 'ప్రజాశక్తి'తో సిఐటియు పోరాటాల ప్రత్యేకత, విధానంపై ఆయన మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

నాటి పరిస్థితులు ఇలా..

1967లో దేశ వ్యాప్తంగా 9 రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడించి ప్రత్యామ్నాయ ప్రభుత్వాలు ఏర్పాటు జరిగాయి. నెహ్రూ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అండగా ఉందని రుజువైన కాలం అది. 1970 మే 31న అనివార్య పరిస్థితుల్లో సిఐటియు ఒక లక్ష్యంగల సంస్థగా ఐక్యతా పోరాటం నినాదంతో స్థాపించబడింది. జూన్‌లోనే దేశ వ్యాప్తంగా కార్మికవర్గ ఐక్యత కోసం పిలుపునిచ్చింది. కానీ ట్రేడ్ యూనియన్‌గా ఏర్పడిన సిఐటియును ఇతర సంఘాలు అవహేళనగా మాట్లేడే పరిస్థితి నాడు ఉండేది. 1970లో ఒక సంఘం అఖిలభారత నాయకత్వం ఆంధ్రప్రదేశ్‌లో సిఐటియు బోర్డును ఎక్కడ పెడతారంటూ ప్రశ్నించేవారు. అంటే సిఐటియు చాలా నామమాత్రంగా ఉండేదని వారి విమర్శ. 1977 నాటికి దేశ వ్యాప్తంగా వామపక్ష ప్రభుత్వాలు బెంగాల్, కేరళ, త్రిపురలో ఏర్పడ్డాయి. సిఐటియు అత్యంత సమరశీల పోరాటాలు చేసే సంస్థగా కార్మిక సంస్థలు, కార్మికులు గుర్తించారు. 1974లో జరిగిన రైల్వే సమ్మెలో కామ్రేడ్ సమర్ ముఖర్జీ ఛైర్మన్‌గా రైల్వే పోరాటంలో కీలకపాత్ర పోషించారు. ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం రైల్వే పోరాటం సహా కార్మిక ఉద్యమాలను తీవ్రంగా అణచివేసింది. 1976లో ఎమర్జెన్సీని వ్యతిరేకించి నిలబడ్డ ఏకైక కార్మిక సంస్థ సిఐటియు మాత్రమే. తొలి నుంచీ కార్మికుల హృదయాల్లో సిఐటియుది చిరస్మరణీయ స్థానం.

ఆంధ్రప్రదేశ్‌లో సిఐటియు ప్రారంభ రోజుల్లో...

రాష్ట్రంలో సిఐటియు ప్రారంభ రోజుల్లో అనేక తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంది. సిఐటియు రాష్ట్ర కేంద్రం, ఢిల్లీ కేంద్రం అధ్యక్షులు పర్సా సత్యనారాయణ, నండూరి ప్రసాదరావు నాయకత్వంలో అలుపెరగని పోరాటం చేసింది. శ్రీహరి, లక్ష్మయ్య హైదరాబాద్‌లోని ఎంవి.భాస్కరరావు సహకారంతో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో సిఐటియు సంఘాలు అతి వేగంగా నెలకొల్పడం జరిగింది. రాజమండ్రిలో బాలాజీదాస్ నాయత్వంలో పేపర్ మిల్లు పోరాటం, రాయలసీమలో పోరాటం వంటి అనేక ఉద్యమాల ఫలితంగా కార్మికుల ఆదరణ పొందింది.

టిటిడిలో పోరాటాలు

నాడు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆద్వర్యంలోనే రవాణా బస్సులు నడిచేవి. అలాగే అడ్డాలు తయారు చేసే కార్మికుల పని ప్రదేశం (పోటు) పనుల గురించి సిఐటియు పోరాడుతూ వారిని కార్మికులుగా గుర్తించి బోనస్ చెల్లించాలని సుప్రీం కోర్టులో సమస్యను లేవనెత్తి విజయం సాధించడం విశేషం. జస్టిస్ కృష్ణయ్య న్యాయమూర్తిగా ఆనాడు ఉండేవారు. కేంద్ర ప్రభుత్వ పరిశ్రమలు హైదరాబాద్, విశాఖలోనే కేంద్రీకరించబడి ఉండేవి. 1990 నాటికి ఈ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో సిఐటియు సంఘాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ రంగ కార్మికుల్లో ఒక బలమైన స్థానాన్ని సిఐటియు సంపాదించింది. దీని ఫలితంగా ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటాల్లో హైదరాబాద్‌లోని ఐడిపిఎల్, హెచ్ఎంటి కార్మికులు ఎన్నో విజయాలు సాధించారు.

వందల సంఖ్యలో సంఘాలకు సిఐటియు నాయకత్వం

విశాఖ ప్రభుత్వ రంగ సంస్థలైన హిందుస్థాన్ షిప్‌యార్డు, పోర్టు, స్టీల్‌ప్లాంట్ వంటి సంస్థల్లో సిఐటియు ఒకటి లేదా రెండు స్థానాల్లో నిలబడింది. ప్రతి జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికులను సమీకరించడంలో అద్భుతమైన కృషి చేసింది. భీమవరం కేంద్రంగా రైస్ మిల్లు కార్మికులను, హోటల్స్ హమాలీలను ఇతర అనేక రంగాల కూలీలను సమీకరించి నిరంతర పోరాటాలను నిర్వహించింది. వీటి ఫలితంగా నేడు స్కీం కార్మికులు అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు మొదలుకొని భవన నిర్మాణం, తోపుడు బళ్ళ కార్మికులు సహా చిన్నా, పెద్దా కలిపి 580కి పైగా సంఘాలకు వివిధ రంగాల్లో సిఐటియు నాయకత్వం వహిస్తోంది.



అంగన్వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ డే వేడుక

సిఐటియు జెండా నీడన
ఐక్య పోరాటాలు మరుపురాని విజయాలు

- స్కీమ్ వర్కర్ల మనోగతం ఇదీ...



భీమిలిలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : 'ఐక్యత పోరాటం' నినాదాన్ని అందిపుచ్చుకుని సిఐటియు జెండా నీడన హక్కుల సాధన, పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి స్కీంవర్కర్ల ఐక్యపోరాటాలు సత్ఫలితాలనే ఇచ్చాయి. గుర్రాలతో తొక్కింపు, పోలీసుల లాఠీల దెబ్బలు, అక్రమ కేసులు, వేధింపులు ఇలా ప్రతికూల పరిస్థితుల్లో కూడా సమరశీల పోరాటాలతో ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు కొన్ని సౌకర్యాలను, హక్కులను సాధించగలిగారు. మొదటి నుంచి తమకు అండదండగా ఉంటున్న సిఐటియు అఖిల భారత మహాసభ నవ్యాంధ్రలో మొదటిసారిగా విశాఖ మహానగరంలో ఈనెల 31 నుంచి వచ్చేనెల 4 వరకు జరగనున్న నేపథ్యంలో దాన్ని విజయవంతం చేసేందుకు స్కీం వర్కర్లు సన్నద్ధమౌతున్నారు. ఇప్పటికే ర్యాలీలు, సదస్సులు, ఇతర మార్గాల్లో మహాసభ జయప్రదానికి విస్తృత ప్రచారం నిర్వహించిన స్కీం వర్కర్లు వచ్చేనెల 4న విశాఖలో జరిగే కార్మిక మహా ప్రదర్శన ర్యాలీ, ఆర్‌కె.బీచ్‌లో బహిరంగసభకు తరలివెళ్లేందుకు సన్నద్ధమౌతున్నారు. సిఐటియు అఖిలభారత మహాసభ నేపథ్యంలో కొందరు స్కీంవర్కర్ల మనోగతమిది.

పోరాడి హక్కుల సాధన



పిల్లలకు సేవ చేయొచ్చన్న ఆలోచనతో అంగన్వాడీ కార్యకర్తగా ఉద్యోగంలో చేరినా వచ్చిన అరకొర వేతనంతో జీవనం కష్టం కావడంతో సిఐటియు ఆధ్వర్యంలో పోరాటంతో దశలవారీగా రూ.2,200 నుంచి నేడు రూ 11,500 వేతనం సాధించుకున్నాం. ఆరోగ్యాంధ్ర నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్న అంగన్వాడీలకు ఇంకా పనిభారం, వేతన, ఉద్యోగభద్రత సమస్యలున్నాయి. కనీస వేతనం రూ.26వేలు అమలు, ఉద్యోగభద్రత, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ అమలుకు పోరాటం చేస్తున్నాం. సిఐటియు అండతో ఇప్పటివరకు కొన్ని హక్కులను సాధించుకున్నాం. ఇదేరీతిన సమరశీల పోరాటాలు చేసి మిగతా హక్కులను సాధించుకుంటాం.

దొంతల కాసులమ్మ,
అంగన్వాడీ కార్యకర్త
ఆనందపురం

పారితోషికం నుంచి వేతనం వరకు...

సిఐటియు జెండా నీడన సమిష్టిగా పోరాటంతో పనికిచ్చే పారితోషికం నుంచి నేడు నెలసరి రూ.పది వేల వేతనం పొందేస్థాయికి చేరుకున్నాం. గర్భిణి పేరు నమోదు, ఆసుపత్రికి తరలింపు, ప్రసవాలు, వ్యాక్సినేషన్ ఇలా చేసిన ఒక్కో పనికి ఇంతమొత్తం అంటూ మొక్కుబడి పారితోషికం ఇచ్చేవారు. వచ్చిన డబ్బుతో ఆసుపత్రికి రానుపోను ఖర్చులకైనా సరిపోయేది కాదు. కుటుంబపోషణ కష్టంగా ఉండేది. సిఐటియు అండతో పోరాటం చేసి నేడు రూ.పదివేల వేతనం సాధించాం.యాప్‌లు, ఇతర పనిభారం పెరిగింది. ప్రభుత్వం ఉద్యోగభద్రత కల్పించి, కనీస వేతనాలు ఇవ్వాలి. ఇఎస్ఐ, పిఎఫ్,గ్రాట్యూటీ ఇతర సౌకర్యాలు అమలు చేయాలి

పి సూర్యకళ, ఆశా కార్యకర్త
తోటవీధి జివిఎంసి మూడోవార్డు, భీమిలి



గర్భిణిని ఆసుపత్రికి తీసుకొచ్చిన ఆశా సూర్యకళ

పోరాటం కొనసాగిస్తాం



మధ్యాహ్న భోజన పథకం అమలు తొలినాళ్లలో కర్రల పొయ్యిపై అన్నం, సాంబారు వండి వడ్డించే వాళ్లం. తర్వాత వంటగ్యాస్‌పై వంట చేసే వాళ్ళం. అటు తర్వాత అక్షయపాత్ర సంస్థకు వంట నిర్వహణను అప్పగించి, మధ్యాహ్నభోజన కార్మికులకు అన్యాయం చేశారు. కొంతకాలం తర్వాత సిఐటియు ఆధ్వర్యంలో పోరాటంతో రూ.వెయ్యి వేతనం సాధించుకుని తర్వాత రూ.మూడు వేలకు పెంచారు. అయితే వేతన చెల్లింపు సక్రమంగా లేదు. కనీస వేతనం రూ.26వేలు అమలు, ప్రమాదబీమా వర్తింపు, పిఎఫ్, గ్రాట్యూటీ, ఇతర సౌకర్యాలకు పోరాటం కొనసాగిస్తాం

ఎం.గురమ్మ,
మధ్యాహ్న భోజన కార్మికురాలు
ఎగువపేట, జివిఎంసి మూడో వార్డు, భీమిలి

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం
ఆదివారం 28 డిసెంబర్ 2025

శ్రామిక ఉత్సవ్ అదుర్స్

CITU
18TH ALL INDIA CONFERENCE
2025 DEC 31 - 2026 JAN 4 VISAKHAPATNAM

ఉత్తేజంగా సాగిన కళా, విజ్ఞాన, సాహిత్య వేదికలు
ఆకట్టుకున్న గేయాలు, నృత్యాలు

విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ జరుగనున్న సిఐటియు అఖిల భారత మహాసభను పురస్కరించుకుని బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్ వెనుక ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శనివారం నుంచి తలపెట్టిన శ్రామిక ఉత్సవ్ ఘనంగా ఆరంభమైంది. అందరిలో ఉత్తేజం, చైతన్యం నింపింది. ఓ పెద్ద పండగలా ఈ ఉత్సవ్ సాగింది. ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి భారీగా కార్మికులు, మేధావులు, కళాకారులు తరలివచ్చారు. ప్రముఖ సినీ నటుడు ప్రకాష్ రాజ్ డప్పు కొట్టి ఉత్సవ్‌ను ప్రారంభించారు. ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిస్థితులపై ఆయన చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఉత్సవ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన పలు ప్రదర్శనలను ప్రముఖులు ప్రారంభించారు. కళారూపాలతో ఉత్సవ వేదిక హోరెత్తింది.


ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు


శ్రామిక ఉత్సవ్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న ప్రకాష్ రాజ్



సంప్రదాయ నృత్యంతో ఆకట్టుకున్న గుజరాత్ కళాకారులు


పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న, చిత్రంలో ఎంవిఎస్.శర్మ, రమణమూర్తి, తెలకపల్లి రవి


శ్రామిక ఉత్సవ్ వేదికపై నుంచి నినదిస్తున్న ప్రకాష్ రాజ్, సిహెచ్.నర్సింగరావు, గఫూర్, తెలకపల్లి రవి, రమణమూర్తి, దాడి సత్యనారాయణ, కుమార్, రమాప్రభ తదితరులు




అదరహో అనిపించేలా సాగిన నృత్య ప్రదర్శనలు


నృత్యాలతో ఆకట్టుకున్న పిఎన్ఎం కళాకారులు


దాడి సత్యనారాయణకు జ్ఞాపిక బహూకరణ


ప్రకాష్ రాజ్‌కు విశాఖ విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న నాయకులు


కార్టూన్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న సిహెచ్.నర్సింగరావు


గాజు పెంకులపై నడక


షార్ట్ ఫిల్మ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న సత్యానంద్ తదితరులు

జ్యూట్ కార్మికోద్యమంలో మైలురాయి 9ఎ పోరాటం

పాలకుల మెడలు వంచి.. యాజమాన్యం కుయుక్తులను తుత్తునియలు చేసిన 2003 నాటి ఉద్యమం



మూతపడిన చిట్టివలస జ్యూట్ మిల్లు ఇదే..

ప్రజాశక్తి-భీమునిపట్నం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చిట్టివలస జ్యూట్ మిల్లులో 9(ఎ) నోటీసుకు వ్యతిరేకంగా 2003లో జరిగిన పోరాటం జ్యూట్ కార్మికోద్యమంలోనే ఒక మైలురాయి వంటిది. సముద్రంలో ఉవ్వెత్తున లేచిన కెరటం వలె, చిట్టివలస జ్యూట్ కార్మికులు చేసిన ఈ పోరాటం రాష్ట్ర జ్యూట్ కార్మికవర్గంపై తీవ్రంగా ప్రభావం చూపింది. పాలకుల కుట్రలు, యాజమాన్యం కుయుక్తులను జ్యూట్ కార్మికులు తుత్తునియలు చేశారు. 118 రోజుల పాటు జ్యూట్ కార్మిక వర్గం జరిపిన ఈ వీరోచిత పోరాటం స్ఫూర్తిదాయకమైనది.

ఉమ్మడి రాష్ట్రంలోని జ్యూట్ యాజమాన్యాలు పోటీ పడుతూ దాదాపు అన్ని మిల్లుల్లోనూ కార్మిక హక్కులపై దాడి చేసిన కాలమది. పారిశ్రామిక వివాదాల చట్టం 1947 సెక్షన్ 9(ఎ) కింద కార్మిక హక్కులను హరించే 13 అంశాలతో చిట్టివలస జ్యూట్ యాజమాన్యం నోటీసు జారీ చేసింది. ఇది 2003 జూన్ 1 నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించింది. ఇందులో డిఎలో ప్రతిష్టంభన, పని భారం పెంపు, ఉత్పత్తితో జీతాలను ముడిపెట్టడం లాంటి ప్రధానమైన కార్మిక వ్యతిరేక చర్యలు ఉన్నాయి. ఈ విధానాలను యథేచ్ఛగా అమలుకు పూనుకోవడంతో సిఐటియు కార్మిక వర్గ ఐక్య పోరాటాలకు సిద్ధమైంది. ఆ సమయంలో చిట్టివలస జ్యూట్ మిల్లులో చిట్టివలస జ్యూట్ మిల్స్ మెకానికల్ వర్కర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గుర్తింపు సంఘంగా ఉంది. 9(ఎ) నోటీసుకు వ్యతిరేకంగా అప్పట్లో ప్రతిపక్ష కార్మిక సంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి సంఘటిత పోరాటాలను నడపడంలో, సమరశీలతను ప్రదర్శించడంలో సిఐటియు కీలక పాత్ర పోషించింది. 9(ఎ) నోటీసుకు వ్యతిరేకంగా వివిధ రూపాల్లో కార్మిక వర్గం పోరాటాలు చేసింది. ఇదే సమయంలో 2003 సెప్టెంబర్ 7న అప్పటి టిడిపి ప్రభుత్వంలో కార్మిక శాఖా మంత్రిగా ఉన్న బాబూమోహన్‌కు విశాఖ ప్రభుత్వ అతిథి గహం వద్ద వినతిపత్రం ఇవ్వడానికి ప్రయత్నం చేయగా, అనుమతించకపోవడంతో అక్కడే ఆందోళన చేపట్టారు. సెప్టెంబర్ 8న మంత్రి బాబూమోహన్ విశాఖ నుంచి విజయనగరం కారులో రాత్రివేళ వస్తుండగా తగరపువలస హైవేపై జ్యూట్ కార్మికులు ఆయన్ను ఘరావ్ చేశారు. సెప్టెంబర్ 16న జైల్ భరో నిర్వహించారు. ఈ సందర్భంగా 118 మంది కార్మికులను పోలీసులు అరెస్ట్ చేశారు. అయినా యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకపోవడంతో సెప్టెంబర్ 21న తగరపువలస జంక్షన్‌లో నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని నాటిని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు ప్రారంభించారు. ఈ దీక్షా శిబిరాన్ని నాటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బివి.రాఘవులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వీరయ్య, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు వివి.రామారావు, కాంగ్రెస్ నాయకులు ద్రోణంరాజు శ్రీనివాస్, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఇటువంటి సమయంలో సెప్టెంబర్ 24న ప్రభుత్వం జ్యూట్ ఉద్యమంపై ఉక్కుపాదం మోపింది. అర్ధరాత్రి నిరవధిక దీక్షా శిబిరాన్ని పోలీసులు చుట్టుముట్టారు. పోలీసులు బూటు కాళ్ళతో తొక్కి, లాఠీఛార్జీ చేసి దీక్షా శిబిరంలో భయానక వాతావరణం సృష్టించారు. ఆరోగ్యం క్షీణించిందన్న కారణంతో దీక్షలు చేస్తున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, గుర్తింపు సంఘం నాయకులు ఎస్.రమేష్, జ్యూట్ కార్మిక సంఘాల నేతలు బాబూరావు, అప్పలరెడ్డిలను కేజీహెచ్‌కు తరలించారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన కార్మికులపై అమానుషంగా లాఠీచార్జి చేసి 70 మంది కార్మికులను అరెస్ట్ చేశారు. సిఐటియు నేత ఎస్.రమేష్ మెడపై పోలీసులు బూటు కాళ్లతో తొక్కడం పోలీసు దమనకాండకు నిదర్శనం. అప్పటి ప్రభుత్వ, పోలీసుల నిరంకుశ వైఖరికి నిరసనగా, జ్యూట్ కార్మిక పోరాటానికి సంఘీభావం తెలుపుతూ రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన రంగాల కార్మికులు రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. కెజిహెచ్ నుండి వచ్చి కలెక్టరేట్ వద్ద దీక్షలు చేశారు. అనంతరం మళ్లీ తగరపువలసలో దీక్షలను ప్రారంభించారు. దీంతో ఎట్టకేలకు ప్రభుత్వం, యాజమాన్యం దిగొచ్చాయి. సెప్టెంబర్ 26న 9 (ఎ) నోటీసులోని కార్మికులకు నష్టం చేసే అంశాలను యాజమాన్యం ఉపసంహరించుకుంది. జ్యూట్ కార్మికుల్లో ఆనందం వెల్లివిరిసింది. అప్పటి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అజశర్మ చేతుల మీదుగా గ్లూకోజ్ నీళ్ళు ఇచ్చి సిహెచ్.నరసింగరావు చేపట్టిన దీక్షను విరమింపజేశారు. సెప్టెంబర్ 27న సాయంత్రం 7గంటలకు విజయోత్సవసభ నిర్వహించారు. జ్యూట్ కార్మిక వర్గం జరిపిన పోరాటం రాష్ట్ర జ్యూట్ కార్మికోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని ఇప్పటికీ జ్యూట్ కార్మికులు చెప్పుకుంటున్నారు.



తగరపువలస జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న బివి రాఘవులు (ఫైల్ ఫొటో)

యాజమాన్యం కవ్వింపు చర్యలు.. అడ్డుకున్న సిఐటియు

సిఐటియు గుర్తింపు సంఘంగా ఉన్న ప్రతి సందర్భంలోనూ జ్యూట్ యాజమాన్యం అనేక రూపాల్లో కార్మికులపై కవ్వింపు చర్యలకు పాల్పడేది. క్యాంటీన్ రేట్లు పెంచేందుకు, పలు డిపార్ట్‌మెంట్లలో కార్మికులపై పని భారం పెంచేందుకు యాజమాన్యం పలు సందర్భాల్లో జరిపిన ప్రయత్నాలను సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు అడ్డుకున్నారు. ఇలా యాజమాన్యం కవ్వింపు చర్యలకు పాల్పడ్డ ప్రతి సందర్భంలోనూ కార్మికులు కలిసి కట్టుగా ప్రతిఘటించారు.



జ్యూట్ కార్మికుల నిరవధిక దీక్షలు, ఆందోళన కార్యక్రమాలు (ఫైల్ ఫొటో)



షిప్‌యార్డు ప్రైవేటీకరణకు అడ్డుకట్ట

- సిఐటియుది గొప్ప పోరాటం
- జాతీయ మహాసభ విజయవంతానికి కార్మికులు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో ఈ నెల 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకూ జరుగనున్న సిఐటియ జాతీయ మహాసభలు అత్యంత కీలకమైనవని, విశాఖపట్నం హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్)ను ప్రయివేటీకరణకు గురికాకుండా కాపాడడంలో ఏళ్లతరబడి సిఐటియు సాగించిన ఉద్యమాలను ఈ సందర్భంగా షిప్‌యార్డు కార్మికులు, ఉద్యోగులు గుర్తుకు తెచ్చుకుంటున్నారని **షిప్‌యార్డు లేబర్ అండ్ స్టాఫ్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు వి.ప్రసాద్** వెల్లడించారు. సిఐటియు మహాసభ సందర్భంగా ప్రసాద్ ప్రజాశక్తితో మాట్లాడుతూ, షిప్‌యార్డులో యూనియన్ స్థాపించిన నుంచి నేటివరకు అనేక పోరాటాలు, ఉద్యమాల ద్వారా షిప్‌యార్డు ప్రయివేటుపరం కాకుండా కాపాడుకున్నట్లు తెలిపారు. పోరాటాలకు సంబంధించి ఆయన మాటల్లోనే...

జిఎంఎల్ ప్రయివేటుకు కట్టబెట్టే కుట్ర...

కేంద్ర ప్రభుత్వం జిఎంఎల్ ప్రయివేటు సంస్థకు కట్టబెట్టాలని చూడగా ప్రభుత్వ రంగంలో కొనసాగేలాగ సిఐటియు కృషి చేసి నిలువరించింది. సిపిఎం నేత సీతారాం ఏచూరి చేసిన కృషి షిప్‌యార్డు విషయంలో ఎనలేనిది. డిఫెన్స్‌లో విలీనం చేసేంతవరకూ పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాలు, షిప్‌యార్డు రక్షణకు ఎంతగానో తోడ్పడ్డాయి. దేశంలో ఎక్కడా పర్మినెంట్ రిక్రూట్‌మెంట్ లేని రోజుల్లో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌కె మిశ్రా సహకారంతో 275మందిని సిఐటియు పర్మినెంట్ చేయించింది. సిఐటియు కృషితో 5 ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్‌ఎస్‌ఎస్)ల వర్క్ ఆర్డర్స్ షిప్‌యార్డుకు దక్కింది. సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ డిఫెన్స్ మినిస్ట్రీకి లేఖ రాస్తూ పెండింగ్‌లో ఉన్న 5 ఎఫ్‌ఎస్‌ఎస్‌లు హిందుస్థాన్ షిప్‌యార్డుకు కేటాయించాలని కోరారు.

ప్రభుత్వ విధానాలతో పర్మినెంట్ ఉద్యోగుల తరుగుదల...

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రయివేటీకరణ విధానాల వల్ల పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. 2010లో పర్మినెంట్ ఉద్యోగులు 4వేల మంది ఉండగా నేటికి 310కి కుదింపబడ్డారు. ప్రధాన డిపార్టమెంట్‌లన్నీ కాంట్రాక్టర్ల చేతుల్లోకి వెళ్లిపోవడంతో యార్డులో కాంట్రాక్టీకరణ పెరిగిపోయింది. కేంద్ర ప్రభుత్వం షిప్‌యార్డును ఈ విధంగా ప్రయివేటీకరణ చేసేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఈ ప్రయివేటీకరణ విధానాలపైనా, షిప్‌యార్డును పూర్తిగా ప్రభుత్వ రంగంలో నిలిపేందుకు సిఐటియు సాగిస్తున్న అవిరళ కృషి అజరామరమైనది.

ప్రయివేటుకు షిప్‌ల కాంట్రాక్టును వ్యతిరేకిస్తున్న సిఐటియు

5 ఎఫ్‌ఎస్‌ఎస్‌ల వర్క్ ఆర్డర్ షిప్‌యార్డుకు వచ్చినప్పటికీ అందులో 2 ఎల్అడ్‌టికి కేటాయించడాన్ని సిఐటియు మొదటనుంచీ వ్యతిరేకిస్తూ పోరాడుతోంది. దీనివల్ల షిప్‌యార్డు ఆర్థికంగా నష్టపోతుంది. 4 ఎల్‌పిడిఎస్ 2012లో హెచ్‌ఎస్‌ఎల్‌కు కేటాయిస్తామని గతంలో కేంద్ర ప్రభుత్వం చెప్పింది. డిఫెన్స్ అక్విలైజేషన్ కమిటీ (డిఎసి) కూడా రూ.33వేల కోట్లతో 4 ఎల్‌పిడిఎస్‌ల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. హిందుస్థాన్ షిప్‌యార్డుకే ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేస్తోంది. పెట్రోలియం, సహజవాయువులు, ఉక్కు ఎరువుల రంగాలు, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో కలిసి 207 షిప్పులను షిప్‌యార్డు నిర్మించాలని ప్రణాళిక రచించడం మంచి పరిణామం. దీంట్లో ట్యాంకర్లు, బల్క్ కారియర్‌లు, లైనర్లు, అఫ్‌షోర్ సరఫరా నౌకలతో సహా 55 నౌకలు ఉన్నాయి. ఇతర అన్ని రకాల 800 షిప్‌లు దేశానికి అవసరమని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ షిప్పులు ఇవ్వడానికి హెచ్‌ఎస్‌ఎల్‌ను పరిగణలోకి తీసుకోవాలని సిఐటియు పోరాడుతోంది.

ఎల్అండ్ ఎం సిరీస్ ఉద్యోగుల పర్మినెంట్...

348 ఎల్అండ్ ఎం సిరీస్ ఉద్యోగులు షిప్‌యార్డులో పనిచేస్తున్నారు. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ నుంచి వచ్చిన ఉద్యోగులు, మెడికల్ డెత్ డిసీజ్డ్ ఎంప్లాయీస్ కలిపి 670 మంది ఉండేవారు. దీంట్లో 2014లో 149 మందిని పర్మినెంట్ చేయాలని దఫదఫాలుగా యాజమాన్యాన్ని సిఐటియు కోరుతోంది. కొంతమందిని పర్మినెంట్ చేసి మిగిలిన వారిని పర్మినెంట్ చేయకుండా ఉంచడం ఆర్టికల్ 14 ప్రకారం వివక్ష చూపడమే కావున మిగతా వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తోంది.

షిప్‌యార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి...

దేశంలోనే అతిపురాతనమైన తొలి నౌకా నిర్మాణ కేంద్రం హిందుస్థాన్ షిప్‌యార్డు. దీంట్లో మౌలిక వసతుల అభివృద్ధి కోసం సిఐటియు తొలినుంచీ పోరాడుతోంది. కేంద్ర ప్రభుత్వం షిప్‌యార్డు అభివృద్ధికి సుమారు రూ.19వేల కోట్లు కేటాయించింది. షిప్‌యార్డు కంపెనీ, షిప్‌యార్డు కాలనీ కలిపితే 281 ఎకరాల భూమి. విశాఖ పోర్టు నుంచి 99 ఏళ్ల లీజుకు తీసుకుంది. ఆ లీజు కొన్ని సంవత్సరాల్లో పూర్తవుతున్నందున ఆ భూమి మొత్తం షిప్‌యార్డులోకి మార్చాలని సిఐటియు డిమాండ్ చేస్తోంది. న్యాయబద్ధంగా స్టాఫ్ అండ్ వర్క్‌మెన్‌లకు ప్రమోషన్లు కల్పించాలని 10ఏళ్లుగా సిఐటియు పోరాడుతోంది. పదోన్నతులు ఇవ్వకుండా ఏళ్లతరబడి ఒకే కేటగిరిలో ఉంచడాన్ని వ్యతిరేకిస్తోంది. కాంట్రాక్టు ఉద్యోగులందరికీ కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని సిఐటియు పోరాడుతూనే ఉంది.

సాంకేతిక వినియోగంతో నేరాల నియంత్రణ

అసాంఘికకలాపాల అడ్డుకట్టకు డ్రోన్లు : ఎస్‌పి ఎస్.వి.మాధవ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎస్‌పి ఎస్.వి.మాధవ్ రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

విరివిగా సాంకేతిక వినియోగం ద్వారా జిల్లాలో నేరాలను నియంత్రిస్తున్నట్లు ఎస్‌పి ఎస్.వి.మాధవ్‌రెడ్డి తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టకు డ్రోన్లు ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. బాల బాలికల అదృశ్య కేసులలో వంద శాతం గుర్తించి విజయవంతంగా కేసులు పరిష్కరించామన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి వార్షిక మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మహిళల గౌరవానికి భంగం కలిగించే కేసులు 2024లో 53 నమోదుకాగా, 2025లో 48 కేసులు మాత్రమే నమోదయ్యాయన్నారు. 2024లో రేప్ కేసులు 10 కేసులు నమోదుకాగా, 2025లో 11 కేసులు నమోదైనట్లు చెప్పారు. 2024లో పోక్సో కేసులు 10 నమోదు కాగా, 2025లో 4 కేసులు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. మహిళలపట్ల దాడులు, అఘాయిత్యాలు, వేధింపులను నివారించేందుకు మూడు శక్తి బృందాలను ఏర్పాటుచేశామన్నారు. పార్వతీపురం శక్తి టీం 112 కాల్‌కి సత్వరమే స్పందించి ఆత్మహత్య చేసుకోబోయే అమ్మాయిని కాపాడి, ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి వారి బంధువులకు అప్పగించినట్లు గుర్తుచేశారు. ఎస్‌సి, ఎస్‌టిలపై నేరాలు 2024లో 34 కేసులు నమోదు కాగా, 2025లో 19 కేసులు నమోదయ్యాయన్నారు. రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత కల్పించి, ప్రతిరోజూ భద్రత చర్యలు చేపడుతున్నామన్నారు. 2024లో రహదారి ప్రమాదాల్లో 248 కేసులు నమోదుకాగా, 2025లో 256 కేసులు నమోదయ్యాయని చెప్పారు. కాని పోలీస్ శాఖ చేపట్టిన భద్రత చర్యల ఫలితంగా గాయాలపాలైన వారి సంఖ్య 24శాతం తగ్గిందన్నారు. సైబర్ నేరాల సంఖ్య 2024లో 21 కేసులు నమోదు కాగా, 2025లో 43 కేసులు నమోదయ్యాయన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ మహిళా పోలీసులతో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. గంజాయి అక్రమ రవాణాదారులపై 19 కేసులు నమోదు చేసి, 45 మందిని అరెస్ట్ చేసి, 2183.73 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. బాల బాలికల అదృశ్యం కేసులు 32 నమోదుకాగా, 100 శాతం వారిని తిరిగి కనుగొని తల్లిదండ్రులు, సంరక్షకులకు అప్పగించామన్నారు. సమావేశంలో డిఎస్‌పిలు, సిఐలు,ఎస్‌ఐలు పాల్గొన్నారు.

టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటూ, మెరుగైన ర్యాంకుల సాధించే దిశగా అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. శనివారం గాజులరేగ లోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉత్తీర్ణత శాతం పెంచడంతోపాటు అత్యధిక మార్కులు సాధించే దిశగా విద్యార్థుల్లో మరింత పరిణితి తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మోడల్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని సీతానగరం, గాదెలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యాన మోడల్ పేపర్లను శనివారం పంపిణీ చేశారు ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మద్రాపు గోవిందరావు, బొత్స ప్రసాదరావు మాట్లాడుతూ మోడల్ పేపర్లను విద్యార్థులంతా బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల సహాధ్యక్షులు బూరాడ ఆదినారాయణ, నాయకులు గొర్లి పోలినాయుడు, ప్రధానోపాధ్యాయులు ఎం.శంకరరావు, ఉపాధ్యాయులు బెవర రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాల సమీపంలోకి నాగుపాము

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని దబ్బగడ్డ పంచాయితీ బోరింగ్‌వలస ప్రాథమిక పాఠశాల సమీపంలో నాగుపాము సంచరించడంతో పిల్లలు భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో గ్రామస్తులకు సమాచారం అందడంతో పామును హతమార్చారు. సుమారు పది అడుగుల పొడవు ఉందని, ఇలాంటి నాగుపామును ఇంతవరకు చూడలేదని స్థానిక గిరిజనులు అంటున్నారు. పిల్లలు ఏమాత్రం ఏమరపాటు వహించినా పెను విషాదం సంభవించేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

2 నుంచి రెవెన్యూ గ్రామసభలు

ప్రజాశక్తి-సీతంపేట

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ నిమిత్తం జనవరి రెండో తేది నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఉపతహశీల్దార్ శ్రీవిద్య తెలిపారు. కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల్లో తప్పులు లేకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో నమోదైన పట్టాదారుల వివరాలతో పూర్తిగా సరిపోల్చి నిర్ధారించాలని చెప్పారు. పంపిణీ ప్రక్రియను విఆర్‌ఒలు ఆన్‌లైన్ ఇ-కెవైసి అప్లికేషన్ ద్వారా నిర్వహించాలని చెప్పారు.

రహదారి పనులు పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల పరిధిలోని పలు గిరిజన గ్రామాల్లో పిఎం జన్‌మన్, నాబార్డు నిధులతో చేపడుతున్న రహదారి నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఇఇ జి.రవి శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. నిర్మాణం పూర్తయిన రహదారుల నాణ్యతలు, లోపాలను క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎటువంటి జాప్యమూ తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆశయంతో పనిచేస్తే మంచి ఫలితాలు : కలెక్టర్

ప్రజాశక్తి-పార్వతీపురం

క్రీడా రంగంలో ఆశయంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఏర్పాటు చేయనున్న క్రీడా పాఠశాలలో చేర్చుకొనే క్రీడాకారుల ఎంపికల విషయమై సలహాలు, సూచనలపై కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సమావేశం జరిగింది. క్రీడల్లో వ్యవస్థ అనేది వ్యక్తిపై ఆధారపడి ఉండకూడదని, అధికారులు మారినా శిక్షణ నిరంతరం కొనసాగేలా ఒక పటిష్టమైన వ్యవస్థను రూపొందించాలని జిల్లాలో స్పోర్ట్స్ అధికారులు, పిఇటిలకు సూచించారు. పిఇటిలు కేవలం బయట నుంచి మార్గదర్శకత్వం చేస్తూ, బేసిక్స్ నేర్పించే సపోర్ట్ సిస్టమ్‌గా ఉండాలని సూచించారు. బలవంతంగా ఎవరినీ క్రీడాకారులుగా మార్చలేమని చెప్పారు. ఎవరికైతే సహజంగా ఆసక్తి, ప్రతిభ ఉంటుందో వారే రాణిస్తారని స్పష్టంచేశారు. క్రీడల్లో ఈతకు ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ, ఇందులో దాదాపు 26 రకాల విభాగాలు ఉంటాయని, తద్వారా ఎక్కువ పతకాలు గెలుచుకునే అవకాశం ఉందని అభిప్రాయ పడ్డారు. అందుకే నీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రతి పాఠశాలలో ఈతను తప్పనిసరిగా ప్రోత్సహించాలన్నారు. డిఇఒ బ్రాహ్మజీ, డిఎస్‌డిఒ కె.శ్రీధర్ రావు, పిఇటిలు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యాన యువకులు నగరంలో బిక్షాటన చేపట్టారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు బూర వాసు మాట్లాడుతూ నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో కుటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదికి ఒక జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేస్తామని, నిరుద్యోగ భృతి కింద రూ.3వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, నేటికీ అమలు చేయలేదని అన్నారు. తక్షణమే జనవరి 1న జాబ్ క్యాలండర్ విడుదల చేసి ప్రభుత్వ శాఖలో ఖాళీగా వున్నా పోస్టులును భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెలగడ రాజేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. నాగభూషణం, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

కార్మిక, కర్షకులకు అండ ఎర్రజెండా



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఐ నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారత కమ్యూ నిస్టు పార్టీ శతాబ్ద కాలంగా పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు, కార్మిక కర్షకులకు అండగా ఉంటూ అనేక పోరాటాలు చేసి ఎన్నో విజ యాలు సాధించిందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వరరావు అన్నారు. శనివారం విజయనగరంలో పిడబ్ల్యూమార్కెట్‌లో సిపిఐ శత వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కామేశ్వరరావు సిపిఐ జెండాను ఎగురవేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల నిర్బంధకాండకు, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 1925 డిసెంబరు 26న కాన్పూర్ (ఉత్తరప్రదేశ్) గడ్డపై భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భవించి గడిచిన 100 ఏళ్ళ కాలంలో ఎన్నో వీరోచిత పోరాటాలు, త్యాగాలు, మహత్తర విజయాలకు సీపీఐ ప్రతీకగా నిలిచిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్. నాగభూషణం, ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సిహెచ్ చరణ్, హేమంత్, కెల్ల సూర్యనారాయణ, నడిపేన పాపునాయుడు, మజ్జి చిన్న, పతివాడ శ్రీను, చందక శ్రీను మరియు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న డిసిఎస్‌హెచ్ నాగభూషణ్ రావు

ఆస్పత్రిని పరిశీలించిన డిసిహెచ్‌ఎస్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన రాధ మృతదేహాన్ని రిక్షా బండిలో తరలించడంపై పత్రికల్లో కథనాలు రావడంతో డిసిహెచ్‌ఎస్ నాగభూషణరావు శనివారం భద్రగిరి ఆస్పత్రిని సందర్శించారు. మృతురాలి బంధువులతో మాట్లాడగా, తామే రిక్షాలో తీసుకెళ్లినట్లు చెప్పారని నాగభూషణరావు తెలిపారు. ఆసుపత్రిలో మహా ప్రస్థానం వాహనం, అంబులెన్సు సదుపాయం ఏర్పాటు నిమిత్తం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తానన్నారు. జనవరిలోపు నూతనంగా నిర్మించిన భద్రగిరి ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటి పన్నుల వసూలు వేగవంతం

ప్రజాశక్తి-పాలకొండ

ఇంటి పన్నులు వేగవంతంగా వసూలు చేయాలని సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ అన్నారు. శనివారం నగర పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. ఇంటి పన్నులతో పాటు ఇతర పన్నులు కూడా వేగంగా వసూలు చేసేలా దృష్టిపెట్టాలన్నారు. సచివాలయ సిబ్బంది దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముందుగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సందర్శించి ముస్తాబు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు విద్యార్థుల యోగాను తిలకించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ముగ్గురికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని చిదిమి సచివాలయ కార్యదర్శి, మహిళా పోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ తెలిపారు. శనివారం చిదిమి సచివాలయాన్ని ఎంపిడిఒ సందర్శించారు. కార్యదర్శి, మహిళా పోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ విధి నిర్వహణలో అలసత్వం వహించడంతో షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తెలిపారు. సచివాలయం అపరిశుభ్రం ఉందని, పరిశుభ్రం చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పార్వతీపురం

నాలుగో విడత రీ సర్వే కార్యక్రమాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ సురేష్ కోరారు. శనివారం మండలంలోని సూడిగాం గ్రామంలో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో రీసర్వే ప్రాధాన్యత గురించి వివరించారు. భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నాలుగో విడత రీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వసతిగృహ సందర్శన

కురుపాం : కురుపాంలోని బిసి వసతిగృహాన్ని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి శనివారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో ఉన్న స్టాక్‌ను పరీక్షించి, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత, వసతి సౌకర్యాలను సమీక్షించారు. మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించి హాస్టల్ నిర్వహణపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వార్డెన్ టి.శ్రీనివాసరావుకు సూచించారు.

'తిరుమల సాయి'లో పక్కాగా ముస్తాబు

గుమ్మలక్ష్మీపురం :జియ్యమ్మవలస మండలం పెదమేరంగిలోని తిరుమల సాయి హైస్కూల్‌లో ముస్తాబు కార్యక్రమం పక్కాగా నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ రౌతు సరళ కుమారి తెలిపారు. సోమవారం నుంచి శనివారం వరకు విద్యార్థుల ముస్తాబు పరిశుభ్రతను పరిశీలించి ప్రతి తరగతి నుంచి విద్యార్థిని ఎంపిక చేసి బహుమతులు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సతివాడ శంకరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రికి సహకరిస్తాం : మంత్రి

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని మంగళపాలెంలో శ్రీ గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ విజయ శ్రీ ఉప్పలపాటి మెమోరియల్ క్యాన్సర్ ఆస్పత్రికి అన్ని రకాలుగా సహకరిస్తామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో కలిసి శనివారం ఆస్పత్రి ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. అతిథులు ముందుగా హాస్పిటల్ భవనాన్ని సందర్శించారు. ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్ చేస్తున్న సేవలు చూసి కొనియాడారు. అనంతరం 50 మందికి పైగా వికలాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 500 మంది గిరిజనులకు దగ్గులు, బట్టలు పంపిణీ చేశారు. అంధులకు పింఛన్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాటి విజయశ్రీ మెమోరియల్ కేన్సర్ ఆసుపత్రి సభ్యులు ఉప్పలపాటి వెంకటపతి రాజు, ఆయన కుటుంబ సభ్యులు, ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్, వైస్ చైర్మన్, హాస్పిటల్ ఎండి వెలువల ఫణీంద్ర, హాస్పిటల్ డాక్టర్స్, ట్రస్ట్ బృందం, మంగళపాలెం పంచాయితీ సభ్యులు పాల్గొన్నారు.



కొత్తవలస: మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

గంటా కుటుంబానికి మంత్రి పరామర్శ

రామభద్రపురం: మండలంలోని బూసాయవలస గ్రామానికి చెందిన సాలూరు సమితి మాజీ అధ్యక్షుడు గంటా తిరుపతిరావు కుటుంబీకులను రాష్ట్ర గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శనివారం పరామర్శించారు. ఈ నెల 24వ తేదీన ఆయన అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన భార్య రవణమ్మను పరామర్శించి సంతాపం వ్యక్తం చేసి సానుభూతి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీకి వీరు చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. రాజకీయాలలో మచ్చలేని నాయకుడిగా, విలువలకు ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు మడక తిరుపతిరావు, మండల క్లస్టర్ ఇన్చార్జ్ గంట సాయి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల పొట్ట కొట్టొద్దు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నుతోందని జిల్లా సిఐటియు నాయకులు పి.శంకర్రావు అన్నారు. శనివారం పెంట ప్రాథమికోన్నత పాఠశాలలో శంకర్రావుతో పాటు సిఐటియు నాయకులు యస్.గోపాలు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్లలో సెంట్రల్ కిచెన్ ద్వారా స్కూల్ పిల్లలకు భోజనం పంపిణీ చేసేందుకు పరిశీలిస్తున్నట్లు తెలుస్తుందని, ఈ నేపథ్యంలో పెంట పాఠశాలలో భోజనం చేశామన్నారు. మధ్యాహ్న భోజనం కార్మికులు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు పనిచేస్తారని వాళ్లకి ఇచ్చే జీతం కేవలం 3వేలు అని జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గమైన విధానాలకు వ్యతిరేకంగా మధ్యాహ్నం భోజన కార్మికులు ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని అందులో భాగంగా జనవరి 4 విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభల్లో మధ్యాహ్నం భోజన కార్మికులు పాల్గొనాలని కోరారు.


వినతులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

గ్రీవెన్స్ వినతులు పరిశీలన

మెరక ముడిదాం: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం ప్రత్యేక అధికారి మల్లికార్జునరావు గ్రీవెన్స్ ఫిర్యాదులను పరిశీలించారు. మెరకముడిదాం ఉన్నత పాఠశాలను సందర్శించి వందరోజుల ప్రత్యేక తరగతుల ప్రత్యేక ప్లాన్ గూర్చి ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత అయ్యేవిధంగా తగిన యాక్షన్ ప్లాన్ ఉండాలని ప్రధాన ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్ శ్రీరాముల నాయుడు, ఎఒ సుధాకర్ పట్నాయక్, ప్రధానోపాధ్యాయులు ఎస్.తిరుపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆట, పాటలతో ఆరోగ్యం

బొండపల్లి: అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ఆట పాటల ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని గంట్యాడ ఐసిడిఎస్ సిడిపిఒ డి.ఉమా భారతి అన్నారు. శనివారం గొట్లాం సెక్టార్ సూపర్వైజర్ ఎస్.రాజి ఆధ్వర్యంలో అంబటివలస -1వ అంగన్వాడి కేంద్రంలో ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్ (ప్రారంభ బాల్య సంరక్షణ విద్య) నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ ఉమాభారతి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రానికి తమ పిల్లలని తప్పనిసరిగా పంపాలని కోరారు. కేంద్రంలో నిర్వహించే ప్రీ స్కూల్తో పాటు ఆట పాటల ద్వారా విద్యను బోధిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలు, తల్లులు, పాల్గొన్నారు.

బాల్య వివాహాలను పోత్సహిస్తే కేసులు

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు ప్రోత్సహించినా, చేసినా క్రిమినల్ కేసులు నమోదయ్యేలా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ అబురఫీజాన్ హెచ్చరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం టిఎంపిఒఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో చైల్డ్ మేరేజ్ కమిటీలు పటిష్టంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం వస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలపై, కిశోర్ బాలికలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలకు ఫోన్లు అందించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ వరహాలమ్మ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, ఎంపిడిఒ రత్నం, ఎస్ఐ జిల్లా కోఆర్డినేటర్ యూనిస్, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

తెంటు రాజాకు మంత్రి పరామర్శ

బాడంగి: మాజీ ఎమ్మెల్యే జయప్రకాశ్ సతీమణి, మాజీ ఎమ్మెల్యే, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు తల్లి చనిపోయిన విషయాన్ని తెలుసుకున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. రాజా తల్లి మరణం పట్ల సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం

విజయనగరంటౌన్:జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 23న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల దినోత్సవ పోటీలలో జిల్లా నుండి జిల్లా స్థాయి విజేతలుగా ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని విశేష ప్రతిభను ప్రదర్శించారు. హైస్కూల్ స్థాయి, జూనియర్ కళాశాల స్థాయి విద్యార్థులు ఉపన్యాసం,వ్యాసరచన పోటీలలో ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాలలో పాల్గొని విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించిన ప్రతి విద్యార్థికి రూ.5వేలు నగదు బహుమతిని, రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక నగదు బహుమతుల కలెక్టర్ రాంసుందరరెడ్డి అందజేశారు. ఉపాధ్యాయులను అభినందించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పల్లె పండగ-2 కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.కోటి రూపాయల నిధులతో కిల్తంపాలెం, సీతారాంపురం గ్రామాలలో శ్రీజవహర్ నవోదయ విద్యాలయంలో సర్వశిక్షా అభియాన్ నిధులు రూ.48 లక్షలతో నిర్మించనున్న కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శనివారం శంకుస్థాపన చేశారు. సీతారాంపురంలో ఉపాధి నిధులతో, రేవళ్లపాలెం బీటీ రోడ్డు నుంచి ముత్యాలమ్మ గుడి వరకు 1.2 కి.మీ మేర రోడ్డు నిర్మాణానికి రూ.25లక్షలు, బంగారమ్మతల్లి గుడి నుంచి చప్ప వారి కల్లాలకు రూ.25 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ జీ.ఎస్ నాయుడు, మేడపురెడ్డి శ్రీను, టిడిపి మండల అధ్యక్షులు డోకుల


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

అచ్చెంనాయుడు, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, గ్రామ పార్టీ అధ్యక్షులు నానిగిరి రమణాజీ, క్లస్టర్ ఇంచార్జ్ ఇందుకూరి శ్రీనివాసరాజు, పెదగాద రాజు, సర్పంచులు గనివాడ సన్యాసి నాయుడు, ఆడారి మహేష్, లగుడు తిరుపతి రావు, మాజీ ఎంపిటిసి ఆడారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పని సులభతరానికే ఫోన్లు అందజేత

ప్రజాశక్తి - చీపురుపల్లి

అంగన్వాడీ ద్వారా అందిస్తున్న పని సులభతరం చేసేందుకే 5జి మొబైల్ ఫోన్లను రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు అందజేస్తుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్మల్లిక్ నాయుడు అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో శనివారం అంగన్వాడీ కార్యకర్తలకు ఆయన సెల్ఫోన్లు అందించారు. ఈ సందర్భంగా రామ్మల్లిక్ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలకూ న్యాయం చేస్తోందని అందులో భాగంగానే ఐసిడిఎస్లో మినీ అంగన్వాడీలగా ఉన్న 13 కేంద్రాలను అప్ గ్రేడ్ చేస్తూ మెయిన్ అంగన్వాడీలుగా మార్పు చేసిందని అన్నారు. మినీ అంగన్వాడీలో పనిచేసిన కార్యకర్తలకు మెయిన్ అంగన్వాడీలుగా మారుస్తూ ప్రొసీడింగ్స్ కాపీలను అంగన్వాడీ కార్యకర్తలకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రౌతు కామునాయుడు, సారిపాక సురేష్, గవిడి నాగరాజు, ముల్లు రమణ, వెంపడాపు రమణమూర్తి, ఎఎంసి చైర్మన్లు రేగాన రామారావు, తాడి చంద్రశేఖర్, వైస్ చైర్మన్ దాసరి శివప్రసాద్, జనసేన పార్టీ జిల్లా కోఆర్డినేటర్ కోట్ల కృష్ణ, చీపురుపల్లి మేజర్ పంచాయితీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, సిడిపిఒ నాగమణి, అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

దాతల సాయం కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని రెడ్డి కంచేరు గ్రామానికి చెందిన బైరెడ్డి సురేష్, సైలజా దంపతులకు ఈ నెల 8న కుమారుడు జన్మించాడు. ప్రస్తుతం నెక్రోటైజింగ్ ఎంటెరోకోలైటిస్ అనే అత్యంత ప్రమాదకరమైన వ్యాధితో బాలుడు పోరాడుతున్నాడు. చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖపట్నం ఆరిలోవలోని అపోలో హాస్పిటల్లో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. డాక్టర్ల వివరాల ప్రకారం, చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు వెంటనే చేయాల్సిన చికిత్సకు సుమారు రూ.12లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు స్పష్టం చేశారు. అయితే, ఈ వైద్య ఖర్చులు భరించే స్తోమత లేకపోవడంతో చిన్నారి తండ్రి బైరెడ్డి సురేష్ తల్లడిల్లిపోతున్నాడు. కుమారుడి ప్రాణాలు కాపాడుకోనేందుకు శతవిధాలుగా ప్రయత్నం చేస్తున్నాడు. ప్రజలు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చిన్నారి ప్రాణాలను కాపాడాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. సహాయం చెయ్యాలనుకునే వాళ 8374467856, 9390141053 నెంబర్లను సంప్రదించాలని వేడుకుంటున్నారు.


చికిత్స పొందుతున్న చిన్నారి

ఎయు ఫుట్‌బాల్ జట్టుకు నవీన్ ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి పి. నవీన్ ఆంధ్ర విశ్వవిద్యాలయ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక కావడం గర్వకారణమని కళాశాల యాజమాన్యం తెలిపింది. అంతర్ కళాశాల స్థాయి పోటీల్లో తన ప్రతిభను చాటుతూ ఈ ప్రతిష్ఠాత్మక ఎంపిక సాధించిన నవీన్ ను కళాశాల సంచాలకులు డాక్టర్. ఎం.శశిభూషణ రావు అభినందించారు. క్రీడల్లో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడం సత్య డిగ్రీ కళాశాల కు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఎంవి సాయి దేవ మణి మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడల్లో నూ ప్రతిభ కనబరిచే విద్యార్థులను కళాశాల ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. కోచ్ ఎస్. జార్జ్ జాన్ కఠిన సాధనతోనే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్లు కెప్టెన్. ఎం.సత్య వేణి, లెఫ్టినెంట్. ఎం.ఉదయ్‌కిరణ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలేవీ?

ప్రజాశక్తి - జామి

మండలంలోని లొట్లపల్లి సంతకు అక్రమంగా లైసెన్సు రెన్యువల్ చేసిన అధికారులపై చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మండల కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ లొట్లపల్లి పశువుల సంతకు నిబంధనలకు విరుద్ధంగా రెన్యువల్ చేసిన పంచాయితీ కార్యదర్శులు బి.మౌనిక దేవి, ఆర్.శివకుమారి, డిప్యూటీ ఎంపిడిఒ జి.ఉమాలపై ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య ఫిర్యాదు చేసిన విషయాన్ని వెల్లడించారు. దీనిపై జిల్లా కలెక్టర్ డివిజనల్ పంచాయితీ అధికారి ఆర్ శిరీష రాణి, విచారణకు ఆదేశించారని అన్నారు. విచారణలో ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారికి నివేదించారని అన్నారు. అనంతరం నివేదిక ప్రతులను ప్రదర్శించారు. రాష్ట్ర గో సంరక్షణ సమాఖ్య కార్యదర్శి కేదారి శెట్టి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శులు ఉప్పాడ పైడితల్లి, భీమపల్లి సంధ్యారాణి, జిల్లా కమిటీ సభ్యులు చింతపల్లి రేణుక దేవి, చందక నీతా చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

గో- సంరక్షణ సమాఖ్య డిమాండ్


నివేదిక పత్రాలను చూపిస్తున్న నాయకులు

బాలాజీ జంక్షన్ నుంచి కాంప్లెక్సు రహదారికి

ఎట్టకేలకు మోక్షం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



కొత్తగా నిర్మిస్తున్న రోడ్డు

బాలాజీ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు రోడ్డు వెడల్పులో ఉండి పోయిన 330 మీటర్ల రోడ్డు పనులు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం నుంచి ప్రారంభించారు. రోడ్డు వెడల్పు చేసిన తర్వాత బాలాజీ జంక్షన్ నుంచి ఎల్ఐసి కార్యాలయం వరకు ఎడమ వైపు బిటి రోడ్డు పనులు నిధులు లేక వేయకుండా అనేక సంవత్సరాల నుంచి ఉండి పోయింది. ఎట్టకేలకు నగర పాలక సంస్థ అధికారులు నిధులు రూ.38 లక్షలు మంజూరు చేసి టెండర్లు పిలవడంతో పనులు కాంట్రాక్టర్ రెడ్డి రాజ్ కుమార్ టెండర్ దక్కించుకొని పనులు ప్రారంభించారు. శనివారం నుంచి పనులు ప్రారంభం కావడంతో ఇంజినీరింగ్ అధికారులు ప్రసాదరావు, శ్రీనివాసరావు, ఎఇ సూరినాయుడు పనులు పర్యవేక్షించారు. రెండు రోజుల్లో రోడ్డు పని పూర్తి అవుతుందని అధికారులు తెలిపారు.

రాష్ట్రానికే ఆదర్శంగా ముస్తాబు

ఆత్మీయ అభినందన సభలో కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో విజయవంతంగా అమలువుతున్న ముస్తాబు, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు నేడు రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచాయని కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఒక చిన్న మార్పు రాష్ట్ర స్థాయిలో కదిలించిందని, రాబోయే తరాల మార్పుకు ఇది నాంది అని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఈ కార్యక్రమాలు జిల్లా యంత్రాంగానికి దక్కిన గొప్ప గౌరవమని ప్రశంసించారు. కలెక్టర్ రూపకల్పన చేసిన ముస్తాబు కార్యక్రమం సిఎం ప్రశంసలు పొంది, రాష్ట్ర వ్యాప్తంగా అమలై, జిల్లాకు విశేష గుర్తింపు తెచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆత్మీయ అభినందన సభ ఒక ప్రయివేట్ ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసంగిస్తూ పలు ఆసక్తికర విషయాలను అధికారులతో పంచుకున్నారు. మన్యం జిల్లాలో చేపట్టిన 'ముస్తాబు' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని చెప్పారు. జాతీయ స్థాయిలో ముస్తాబు గుర్తింపు పొందడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ మార్పు రాబోయే తరాల మార్పుకు నాంది అని కలెక్టర్ వివరించారు. జిల్లాలో వినూత్నంగా ప్రవేశపెట్టిన 'రెవెన్యూ క్లినిక్' విధానం ఇప్పుడు ప్రభుత్వ జిఒగా మారిందని, అదే పేరుతో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు. ఒక చిన్న జిల్లాలో ప్రారంభమైన కార్యక్రమాలు రాష్ట్ర స్థాయి విధానాలుగా మారడం వెనుక జిల్లాలోని అధికారుల, సిబ్బంది కృషి ఎంతో ఉందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఇతర ప్రభుత్వ శాఖల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సుంకిలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి- గరుగుబిల్లి

మండల పరిధిలో సుంకి గ్రామ పరిసరాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు సాయంత్రం 6 గంటల తర్వాత ఉదయం 6 గంటల వరకు జాగ్రత్తగా పరిసరాలను గమనించి, ప్రయాణం చేయాలని ఎస్ఐ ఫకృద్దీన్ తెలిపారు. ఐటిడిఎ పార్కు, తోటపల్లి డ్యామ్‌కు వచ్చే పర్యాటకులు పరిసరాలను గమనించి నడుచుకోవాలని కోరారు. రాత్రి వేళల్లో తప్పనిసరి ప్రయాణమైతే ఈ పరిసర ప్రాంతాల్లో వేగంగా వెళ్లవద్దని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏనుగులు సంచరిస్తున్న ప్రదేశాలకు పోవద్దని సూచించారు. అటవీశాఖ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కడకెల్లలో వైద్య శిబిరం

వీరఘట్టం : మండలంలోని కడకెళ్ల గ్రామంలో శనివారం వైద్యాధికారి ఎం.సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, మధుమేహ, రక్తపోటు, జ్వరపీడితులు, తదితర రకాల రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఏకలవ్య పాఠశాలల అభివృద్ధికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. కురుపాం మండలంలోని శివన్నపేటలో ఉన్న ఏకలవ్య పాఠశాలలో రూ.3.60 కోట్లతో స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణ పనులకు ఆమె శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు వసతి సౌకర్యాలు మెరుగుపడితే, పాఠశాల నిర్వహణ మరింత బలపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ కడ్రక కళావతి, టిడిపి మండల కన్వీనర్ కె.వి. కొండయ్య, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, తెలుగు మహిళా నియోజకవర్గ కార్యదర్శి వెంపటాపు భారతి, మాజీ ఎంపిపి రమణమూర్తి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

గుమ్మలక్ష్మీపురం : సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందిస్తామని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. తన కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలు వచ్చి సమస్యలపై వినతులు అందించారు. అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకష్ణను సన్మానిస్తున్న ఉపాధి సిబ్బంది

గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామకృష్ణకు సన్మానం

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలం చినకుదమ గ్రామంలో ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణను శనివారం ఉపాధిహామీ ఎపిఒ రామకృష్ణ, సిబ్బంది, పలువురు అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జోగి భుజంగరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశ్రామిక వృద్ధికి అవగాహన కార్యక్రమాలు

8 పరిశ్రమల ద్వారా 54 వేల మందికి ఉపాధికి ప్రతిపాదన : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులకు విస్త తంగా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. దీనికోసం ఈ నెలాఖరులోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. పరిశ్రమల స్థాపనకోసం వచ్చే దరఖాస్తులను సింగిల్ విండో విధానంలో వెంటనే పరిశీలించి, అనుమతులు మంజూరు చేయాలని చెప్పారు. జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో శనివారం జరిగింది. జిల్లాలో కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి జిల్లా యంత్రాంగం తరపున అన్నివిధాలా సంపూర్ణ సహకారం అందించి, వీలైనంత వేగంగా స్థాపించే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. భూసేకరణపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో కొత్తగా సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్, స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్, స్టీల్ ఎక్స్ఛేంజ్ ఎన్‌ఫ్రా లాజిస్టిక్స్ లిమిటెడ్, అన్నుమి స్పేస్ కార్పొరేషన్, జెఎస్‌డబ్ల్యు ఇండస్ట్రీస్ పార్క్ లిమిటెడ్, వైశాఖి గ్రోత్ కారిడార్, రుషిల్ డెకర్స్, ఎలైట్లాజిక్స్ ఎగ్జిమ్ ఏజెన్సీ ఇండియా లిమిటెడ్ తదితర కంపెనీలు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు వచ్చాయని, వీటి ద్వారా సుమారు 54 వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ ఇ.మురళి, పరిశ్రమలశాఖ ఇన్‌ఛార్జి జిఎం ఎంవి కరుణాకర్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఇంజినీర్ సరిత, అగ్నిమాపక అధికారి రాంప్రకాష్, ఎపిఈపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, ఎస్‌డిసిలు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా ఓటర్ల జాబితా మ్యాపింగ్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ సమర్థవంతంగా జరుగుతోందని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత రాజకీయ పక్షాలకు వెల్లడించారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 51.38 శాతం మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో మిగిలిన ప్రక్రియ పూర్తి చేయనున్నామని చెప్పారు. 2002 ఓటర్ల జాబితా డేటాను బిఎల్ఒ యాప్‌లో 2025 డేటాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియ వేగవంతం అయినట్లు ఆమె వివరించారు. ఈ మేరకు రాజకీయ పక్షాలతో ఆమె ఛాంబరులో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడటానికి కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానాల ప్రకారం జిల్లాలో ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను సమర్థంగా నిర్వహించేలా అధికారులు కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 7,88,302 మంది ఓటర్లకు గాను ఇప్పటివరకు 4,05,034 మంది ఓటర్ల మ్యాపింగ్ జరిగి 51.38 శాతం ప్రక్రియ పూర్తయినట్లు చెప్పారు. ఇందులో పాలకొండ నియోజకవర్గంలో 1,01,927 మంది, కురుపాం నియోజకవర్గంలో 1,02,836 మంది, పార్వతీపురంలో 93,180 మంది, సాలూరులో 1,07,091 మంది ఓటర్లకు మ్యాపింగ్ జరిగినట్లు వివరించారు. ఈ ఏడాది జనవరి 6వ తేదీ నుంచి ఇప్పటివరకు 8,843 అన్ని రకాల క్లెయిమ్‌లను స్వీకరించగా, వాటిలో 7,562 పేర్లను నమోదు చేసినట్లు చెప్పారు. 897 తిప్పి పంపించామని, 384 దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని, వాటిని పరిశీలిస్తున్నామని ఆమె వివరించారు. ఈ సమావేశంలో అన్ని రాజకీయ పక్షాలకు చెందిన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం : జడ్జి

ప్రజాశక్తి- గరుగుబిల్లి

బాల్య వివాహాలు చేయడం చట్ట విరుద్ధమని, దానికి కఠిన శిక్షలు తప్పవని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. శనివారం తోటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 18 సంవత్సరాల కంటే తక్కువ వయసు గల బాలికల వివాహాలు జరగకుండా అడ్డుకోవడం కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమాజంలోని ప్రతిఒక్కరూ బాల్య వివాహాలపై అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి సంఘటనలు కనిపిస్తే వెంటనే 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని సూచించారు.కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. వెంకటరావు, అప్‌హోల్డ్ సేవా సంస్థ ప్రతినిధి బి.సత్యనారాయణ, తోటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల సీనియర్ అసిస్టెంట్ బి. ధనుంజయరావు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెల్లంనాయుడువలసలో పల్లె ముస్తాబు

సీతానగరం :మండలంలోని చెల్లంనాయుడువలసలో శనివారం పల్లె ముస్తాబు కార్యక్రమాన్ని ఎంపిడిఒ ఎంఎల్ ప్రసాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.పారమ్మ, మాజీ సర్పంచ్ బి.పారినాయుడు, వైస్ సర్పంచ్ దాసర వాసుదేవరావు పాల్గొన్నారు.

గుచ్చిమిలో రీసర్వే గ్రామసభ

సీతానగరం :మండలంలోని గుచ్చిమి గ్రామంలో భూ రీసర్వేపై గ్రామసభ ఏర్పాటుచేశారు. తొలుత గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సర్వేయరు పి.లక్ష్మణరావు మాట్లాడుతూ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. అనంతరం రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌డిటి ఉమామహేశ్వరరావు, మండల సర్వేయర్ కె.చంద్రశేఖర్, ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, సర్పంచ్ శ్రీదేవి, ధనుంజయుడు, మాజీ ఎంపిటిసి రెడ్డి వెంకటరమణ, గ్రామ పెద్దలు సల్లాపు సంజీవ నాయుడు పాల్గొన్నారు.

31న పార్కింగ్, దుకాణాలకు వేలం

మక్కువ :శంబర పోలమాంబ జాతర సందర్భంగా దుకాణాలు, వాహనాల పార్కింగ్, సర్కస్ ఆశీల వసూళ్లకు ఈ నెల 31న వేలం నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఎంపిడిఒ సూర్యనారాయణ తెలిపారు. శంబర పంచాయతీ వద్ద బుధవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. జాతరలో ఒక్కో తాత్కాలిక దుకాణానికి రూ.200, సర్కస్ వగైరా ఒక్కింటికి రూ.2 వేలు, పార్కింగ్‌కు ఒక్కో ద్విచక్ర వాహనానికి రూ.20, నాలుగు చక్రాల వాహనానికి రూ.50, ఆటోకు రూ.30 చొప్పున వసూలు ధర నిర్ణయించినట్లు చెప్పారు. ఆసక్తి గలవారు ఈ వేలంలో పాల్గొవాలని ఆయన కోరారు.

ఆశ్రమ పాఠశాలలో కంటి వైద్య శిబిరం

కురుపాం : ఐటిడిఎ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్య బృందం కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు గణేష్, వార్డెన్ కె. సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 215 మందికి కంటి పరీక్షలు చేశారు. ఐదుగురు ఉపాధ్యాయులు, 8 మంది విద్యార్థులకు కళ్లద్దాలకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

సీతంపేట : పులిపుట్టి పంచాయతీలోని ప్రజలు తమ సమస్యలపై టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవికి శనివారం విన్నవించారు. అనేక మందికి ఇళ్ల బిల్లులు కాలేదని, మురుగునీటి కాలువలు లేకపోవడం వల అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. కాలువల కోసం వినతులిచ్చినా కనీసం స్పందన లేదని గ్రామస్తులు తెలిపారు. భూదేవి స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంట్ కార్యదర్శి బి.జయలక్ష్మి, డైరెక్టర్ మూర మోహన్ రావు, మాజీ ఎంపిపి ఆరిక లక్ష్మయ్య పాల్గొన్నారు.

అమానవీయం

పాతేసిన దళిత మహిళ మృతదేహాన్ని వెలికి తీయించిన వైనం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం



పాతిపెట్టిన మృతదేహాన్ని బయటకు తీస్తున్న కుటుంబ సభ్యులు

జియ్యమ్మవలస మండలంలోని చింతలబెలగాం లో అమానవీయ సంఘటన చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన దళిత వృద్ధురాలు బెలగాం పారమ్మ గురువారం మరణించింది. ఆమె మృతదేహాన్ని స్థానిక గుడి చెరువులో దళితులకు కేటాయించిన శ్మశానవాటిక స్థలంలో పూడ్చి పెట్టారు. ఆ చెరువును ఆక్రమించుకున్న కొంతమంది.. మృతురాలి కుటుంబ సభ్యులపై శుక్రవారం చినమేరంగి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ శవాన్ని బయటకు తీయందే తాము ఒప్పుకోబోమని చెప్పారు. ఈ విషయాన్ని పారమ్మ కుటుంబ సభ్యులకు పోలీసులు చెప్పారు. దీంతో రెవెన్యూ అధికారులను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరని పారమ్మ భర్త బెలగాం నాగేసు తెలిపారు. చివరికి తప్పనిసరి పరిస్థితుల్లో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని శనివారం బయటకు తీసి, మరోచోట పాతిపెట్టారు. ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని దళితులు కోరుతున్నారు.

సిటియులో అడ్మిషన్లకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2026-27 సంవత్సరానికి సియుఇటి (పీజీ) ద్వారా సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ విజయనరంలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిందని ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య తంత్రవాహి శ్రీనివాసన్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిద్వారా విశ్వవిద్యాలయంలో నిర్వహించే ఎనిమిది పీజీ ప్రోగ్రాములైన ఎంఎస్‌సి కెమిస్ట్రీ, ఎంఎస్‌సి బయోటెక్నాలజీ, ఎంబిఎ, ఎంఎ ఇంగ్లీష్, ఎంఎ సోషియాలజీ, ఎంఎ ట్రైబల్ స్టడీస్, ఎంఎ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్‌లో అడ్మిషన్లను చేయనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఎన్‌టిఎ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు విధానం, అర్హతలు, పరీక్ష షెడ్యూల్ తదితర వివరాలు ఎన్ టిఎ వెబ్‌సైట్‌లో https://exams.nta.nic.in/cuet-pg ఉన్నాయని మరిన్ని వివరాల కోసం హెల్ప్‌డెస్క్‌ను యూనివర్సిటీ పని దినాల్లో కార్యాలయ వేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

3న జెడ్‌పి ప్రత్యేక బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయములో 1 నుండి 7వ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 3న ఉదయం 10గంటలకు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు సిఇఒ బివి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాల అనంతరం మధ్యాహ్నం 1 గంటకు జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు అధ్యక్షతన బడ్జెట్ ప్రత్యేక సమావేశం జరుగుతుందని తెలిపారు.

31నే పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-పార్వతీపురం

సామాజిక పింఛనుదారులకు రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సర కానుకను ప్రకటించింది. జనవరి ఒకటో తేదికి బదులుగా ఒక రోజు ముందుగా ఈ నెల 31నే ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి పింఛన్లను అందజేస్తారని తెలిపారు. డిసెంబర్ నెలకు గాను నగదు 30వ తేదీన బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు చెప్పారు. సంబంధిత సచివాలయ సిబ్బంది నగదు విత్‌డ్రా చేసుకొని పింఛన్ల పంపిణీకి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనే ధ్యేయం

కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, ఎస్‌పి ఎఆర్ దామోదర్

ప్రజాశక్తి -కంటోన్మెంట్

విజయనగరం జిల్లాను గంజాయిరహిత జిల్లాగా మార్చేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్, కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి శనివారం పిలుపు నిచ్చారు. పోలీసు కళ్యాణ మండపంలో శనివారం నార్కోటిక్ కో-ఆర్డినేషను కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యానవన శాఖలు జిల్లాలో ఎక్కడా గంజాయి సాగు లేకుండా చూడాలని, ఎక్కడైనా గంజాయి సాగు ఉన్నట్లయితే వెంటనే సమాచారాన్ని పోలీసుశాఖకు అందించాలన్నారు. జిల్లాలో గంజాయి రవాణ జరగకుండా పోలీసు శాఖ విస్తతంగా చర్యలు చేపడుతున్నదని, అందుకు రవాణ, అటవీ శాఖలు కూడా తమవంతు సహకారాన్ని అందించాల న్నారు. విద్యాశాఖ, ఉన్నత విద్యాశాఖ, సెట్విజ్ మరియు ఇతర అనుబంధ శాఖలు కళాశాలలు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో గంజాయి వినియోగం లేకుండా చూడాలని అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వ్యక్తులకు చికిత్స అందించేందుకు డ్రగ్స్ అడిక్షన్ సెంటరుకు తరలించాలన్నారు. ఎస్‌పి దామోదర్ మాట్లాడుతూ పోలీసులు నిర్వహించిన దాడుల్లో జిల్లాలో ఎక్కడా గంజాయి సాగు ఉన్నట్లుగా ఎటువంటి ఆధారాలు లేవన్నారు. అయితే, సరిహద్దు రాష్ట్రాలైన ఒడిశా చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుండి జిల్లా మీదుగా హైదరాబాద్, బెంగుళూరు, ఢిల్లీ మరియు ఇతర ప్రాంతాలకు గంజాయి రవాణ జరుగుతుందన్నారు. ఈ రవాణను నియంత్రించేందుకు గంజాయి రవాణ జరుగుతున్న ఏడు మార్గాలను గుర్తించి, ఆయా మార్గాల్లో డైనమిక్ వాహన తనిఖీలను విస్తృతం చేశామన్నారు. జిల్లాలో 5 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, తనిఖీలను ముమ్మరం చేసామన్నారు. జి.ఎస్.టి., ఫారెస్టు, రవాణ, మెరైన్, రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖలు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపడితే గంజాయి రవాణను నియంత్రించవచ్చని ఎస్‌పి అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 1972పట్ల విస్తత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డ్రగ్స్ కంట్రోల్, ఫారెస్టు, డిఎంఅండ్‌హెచ్‌ఒ, జెడ్‌పి, సెట్విజ్ , సోషల్ వెల్ఫేర్, ట్రాన్స్‌పోర్టు అధికారులు, డిఎస్‌పిలు, ఎక్సైజ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి, కలెక్టర్

పోలీసుశాఖకు సహాయసహకారాలు : కలెక్టర్

రహదారి భద్రతను దృష్టిలో పెట్టుకొని, ప్రమాదాల నియంత్రణకు పోలీసుశాఖకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి తెలిపారు. పోలీసుశాఖకు అవసరమైన సహాయ, సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసుశాఖ పనితీరును అభినందించారు. ఎస్‌పి ఎఆర్ దామోదర్ మాట్లాడుతూ ఈ ఏడాది నేరాల నమోదు తీరును, నేరాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ చేపట్టిన చర్యలను వివరించారు. గంజాయి వ్యాపారాలకు పాల్పడుతున్న 18 గ్యాంగులను గుర్తించి, వారిపై నిఘా పెట్టామన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల అనర్థాలను వివరించే ఒదుకు సంకల్పం పేరిట అభ్యుదయం సైకిల్‌యాత్ర పాయకరావుపేట నుంచి ఇచ్చాపురం వరకు సాగిందని తెలిపారు. ప్రమాదాల నియంత్రణకు కారణాలను గుర్తించి, నియంత్రణ చర్యలు చేపట్టామన్నారు. మహిళల రక్షణకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని, 28 పోక్సో కేసుల్లోను, మరో 18 ఇతర కేసుల్లో నిందితులు న్యాయస్థానాల్లో శిక్షింపబడే విధంగా చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో పబ్లిక్‌ప్రాసిక్యూటర్ గేదెల సత్యం మాట్లాడారు. పలువురు డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచితంగా సౌర విద్యుత్తు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంలో భాగంగా, జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు ఉచితంగా సౌర విద్యుత్‌ను అందించే పథకాన్ని జనవరి మొదటి వారంలో ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. అర్హులైన ప్రతి ఇంటిపై రెండు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ ఫలకాలను ప్రభుత్వం ఎటువంటి ఖర్చు లేకుండా ఉచితంగా ఏర్పాటు చేయనుందని, దీనిని లబ్దిదారులకు త్వరితగతిన అందజేయాలని సూచించారు. ఈ పథకం అమలుపై జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ ఎం.లక్ష్మణరావుతోపాటు సంబంధిత సంస్థల ప్రతినిధులతో శనివారం తమ ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. పనులను వేగవంతం చేసి, 2026 జనవరి మొదటి వారంలోనే మంత్రులు, ఎంపి, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పథకం ద్వారా వేల కుటుంబాలకు విద్యుత్ బిల్లుల భారం తగ్గి, శాశ్వత ప్రాతిపదికన వెలుగులు నిండనున్నాయని తెలిపారు.

కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లపై సమీక్ష

కంటోన్మెంట్ : ప్రభుత్వం కేటాయించిన పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల కోసం మార్గదర్శకాలను (పారామీటర్స్) ఆయా శాఖలు వెంటనే అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. జిల్లా అధికారులతో పెర్ఫార్మెన్స్ ఇండికెటర్ల పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా స్థాయిలో 90, మండల స్థాయిలో 82 పరామీటర్లను అప్లోడ్ చేయవలసి ఉందని అధికారులు దీనిపై దృష్టి పెట్టాలని తెలిపారు. కొన్ని శాఖలు కొన్ని పారామీటర్లలో సి- కేటగిరిలో ఉన్నాయని, అన్ని శాఖల ఎ-ప్లస్ కేటగిరీకి రావాలని సూచించారు. సమావేశంలో సిపిఒ బాలాజీ, ఆర్‌డిఒలు, అధికారులు పాల్గొన్నారు



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

క్రీడలు, కళలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా కళలు, క్రీడల్లో కూడా రాణించాలని, తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని శ్రీజన్ పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని పాఠశాలలో విద్యార్థుల ప్రతిభను అభినందించారు. చదువుతో పాటు ఆటలు, పాటలు, నృత్యాలను విద్యార్థులు తమ జీవితంలో అంతర్భాగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతిరోజూ కనీసం 10 నిమిషాల గొంతెత్తి పాటలు పాడటం వల్ల విద్యార్థులలో భయం పోయి, ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. తడబడకుండా మాట్లాడే నైపుణ్యం లభిస్తుందని తెలిపారు. పాఠశాల ముగిసిన తర్వాత నీరసంగా కాకుండా, హుషారుగా గంతులేస్తూ బస్సుల వద్దకు వెళ్లాలని సూచించారు. క్యూ లైన్లలో నిలబడినప్పుడు కూడా స్కిప్పింగ్ వంటివి చేస్తూ చురుగ్గా ఉండాలని చెప్పారు. బస్సు ప్రయాణంలో కూడా వీలైతే సంగీతం వింటూ డాన్స్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వైశాలి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళిత మహిళల గోడును పట్టించుకోరా?

ముంజేరు దళిత మహిళల దీక్షా శిబిరంలో మాజీ ఎమ్‌పి హర్షకుమార్

ప్రజాశక్తి - భోగాపురం



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్‌పి హర్షకుమార్

దళిత మహిళల గోడు పట్టించుకోరా అని మాజీ ఎమ్‌పి హర్షకుమార్ ప్రశ్నించారు. ముంజేరు గ్రామం సిద్దార్థ కాలనీకి చెందిన దళిత మహిళలు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష శనివారం నాటికి 22వ రోజుకు చేరుకుంది. న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న ఈ దీక్షా శిబిరాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ముందుగా ముంజేరు గ్రామానికి చేరుకున్న హర్షకుమార్, సిద్దార్థ కాలనీలో వివాదాస్పదంగా మారిన కాలువ ప్రాంతాన్ని పరిశీలించారు. కాలనీ ప్రజలతో మాట్లాడి సమస్యకు కారణమైన అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోగాపురం మండల కేంద్రంలో దళిత మహిళలు నిర్వహిస్తున్న ధర్నా శిబిరానికి చేరుకుని మహిళలను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళిత మహిళలు 22 రోజులుగా న్యాయం కోరుతూ నిరాహార దీక్ష చేస్తున్నా, సంబంధిత అధికారులు ఇప్పటికీ దీక్షా శిబిరాన్ని సందర్శించకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనం అని అన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించే ఒదుకు అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. దళిత మహిళలకు తక్షణమే న్యాయం జరగకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమస్య పరిస్కారానికి 48గంటలు సమయం ఇస్తున్నామని, కానీ పక్షంలో తానే వచ్చి కూర్చుంటానని చెప్పారు. దళిత సంఘ నాయకులు, దళితులు మద్దతును తెలిపారు.

చేపల పెంపకంతో అధిక ఆదాయం

ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్

ప్రజాశక్తి-సీతంపేట



చేపపిల్లల విడుదలను పరిశీలిస్తున ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్

చేపల పెంపకం ద్వారా అధిక ఆదాయం సంపాదించవచ్చని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ అన్నారు. శనివారం పులిపుట్టి గ్రామంలోని చెరువులో చేప పిల్లలను పిఒ విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపలు పెంచడం ద్వారా ఆదాయంతో పాటు ప్రోటీన్ ఆహారం కూడా తినవచ్చన్నారు. చేపపిల్లల పెంపకంపై రైతులకు సూచనలు అందించాలని అన్నారు. మండలంలోని 34 చెరువుల్లో శనివారం 56,800 చేప పిల్లలను విడిచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మిశ్రా, టిడిపి పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి, అరకు పార్లమెంట్ కార్యదర్శి జయలక్ష్మి, రాజబాబు, సవరతోట మొఖలింగం, మత్స్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.